www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 10 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar
హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక : 101 | ఆదివారం | 22 సెప్టెంబర్, 2024



## కాశ్మీర్‌లో మూడు కుటుంబాల పెత్తనం

- వారికి బుద్ధి చెప్పాల్సిన సమయమిదే
- ఎన్నికల ప్రచారంలో అమిత్ షా

.. 5లో

## 28న ఒకరోజు పర్యటనకు హైదరాబాద్‌కు రాష్ట్రపతి

- నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొననున్న ముర్ము
- రాష్ట్రపతి రాకతో ఏర్పాట్లపై అధికారులతో సిఎస్ సమీక్ష



.. 5లో

# జమిలి పేరిట కుట్ర

దేశాన్ని కబళించాలని బీజేపీ ప్రయత్నం

జమిలి ఎన్నికలపై పోరాటం చేస్తాం

- రాష్ట్రాల మధ్య ఐక్యత దెబ్బతీసే చర్యలు
- ఏచూరి ఉంటే వాటిపై పోరాడేవారు
- ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తున్నది
- సంస్మరణ సభలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** కేంద్రం ప్రభుత్వం జమిలి ఎన్నికల పేరుతో కుట్రకు పాల్పడేందుకు యత్నిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. "జమిలి ఎన్నికల ముసుగులో దేశంలో ఆధిపత్యం చెలాయించాలన్న కుట్ర జరుగుతోంది. జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబలించాలనుకుంటున్న ఇలాంటి కీలక సమయంలో, ఆయన లేకపోవడం దేశ రాజకీయాల్లో తీరని లోటు. రాష్ట్రాల హక్కులను కాపాడాల్సిన ఇలాంటి సందర్భంలో ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు. మనకు దిక్సూచీలా ఉండాల్సిన సమయంలో ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరం. సీతారాం ఏచూరి లాంటి వ్యక్తులు చాలా అరుదు. విద్యార్థి దశ నుంచి దేశ క్రియాశీల రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన స్పూర్తితో జమిలి ఎన్నికల వ్యతిరేక పోరాటంలో ముందుకు వెళ్లాలి" అని రేవంత్ రెడ్డి అన్నారు.

మిగతా 2 లో

## మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్స్

- ఐటీఐల్లో సిలబస్ మార్పులు చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్ సూచన

.. 2లో



## అమెరికాకు భట్టి

అంతర్జాతీయ మైనింగ్ ఎక్స్‌పోకు హాజరు

.. 2లో

# 8,888 కోట్ల కుంభకోణం




## అమృత్‌పథకం టెండర్లలో భారీ గోల్‌మాల్

- సొంత బావమరిది కంపెనీకి కట్టబెట్టిన రేవంత్‌రెడ్డి
- బీజేపీ ప్రభుత్వం విచారణ జరిపించాలి
- తెలంగాణలో రేవంత్ కుటుంబ అవినీతి కథాచిత్రం
- ఈ కుంభకోణంతో సీఎం పదవి కోల్పోయే అవకాశం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ
- సీఎం రేవంత్ పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- సాక్ష్యాలను బయటపెట్టిన కేటీఆర్

**ఖైరతాబాద్, ప్రజానావ:** తెలంగాణలో రేవంత్ రెడ్డి అవినీతి కుటుంబ కథాచిత్రం నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన 8,888 కోట్ల రూపాయల అమృత్ టెండర్ల కుంభకోణం గురించి సాక్ష్యాలతో సహా బయటపెట్టారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే.. ఫిబ్రవరి మొదటి వారంలో 8,888 కోట్ల రూపాయల భారీ అవినీతికి సీఎం రేవంత్ రెడ్డి తెరలేపారని కేటీఆర్ విమర్శించారు. తాను బాధ్యతలు నిర్వహిస్తున్న పురపాలక శాఖ కేంద్రంగా రేవంత్ రెడ్డి ఈ కుంభకోణాన్ని చేశారని అన్నారు. ఈ భారీ కుంభకోణంతో రేవంత్ రెడ్డి పదవీ కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి బావమరిది సూదిని సృజన్ రెడ్డి కంపెనీకి అర్హతలు లేకపోయినా వేల కోట్ల రూపాయల పనులను కట్టబెట్టారని విమర్శించారు. ఇండియన్ హ్యూమ్ పైప్ అనే కంపెనీని పిలిపించి బెదిరించి, ఆ కంపెనీ పేరుతో టెండర్లను కట్టబెట్టారని తెలిపారు. పేరుకే ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ అయినా రేవంత్ రెడ్డి బావమరిది కోసం ఈ టెండర్లను కట్టబెట్టారని కేటీఆర్ అన్నారు.

మిగతా 2 లో



## ప్రభుత్వ ప్రాధాన్యాలు బాగున్నాయి..

### విద్య, వైద్య రంగాల్లో దార్శనికత

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు
- ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం కితాబు
- సచివాలయంలో సీఎంతో భేటి

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** అభివృద్ధి విషయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతలు బాగున్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం కితాబిచ్చింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్ నేతృత్వంలోని బృందం భేటీ అయ్యింది. సీఎం రేవంత్‌రెడ్డి గత నెలలో అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో సమావేశం కాగా, తదుపరి చర్యల కోసం మార్టిన్ రైజర్ బృందం హైదరాబాద్ వచ్చింది. శనివారం సచివాలయంలో సీఎంతో అయ్యింది. ఈ సందర్భంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా, వైద్యం, సాగు నీటి రంగాలను తమ ప్రభుత్వ ప్రాధాన్యాలుగా పెట్టుకున్నామని సీఎం వివరించారు. ఆయా ఆయా రంగాల్లో చేపట్టిన ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. విద్యా, వైద్య రంగాల్లో సీఎం దార్శనికత బాగుందని, భవిష్యత్‌అవసరాలకు అనుగుణమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని మార్టిన్ రైజర్ ప్రశంసించారు. ప్రపంచ బ్యాంకు ఏ రంగాలను ప్రాధాన్య అంశాలుగా ఎంచుకుందో, అవే తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్య అంశాలుగా ఉన్నాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి సహకరించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, పలు విభాగాల ఉన్నతాధికారులు, వరల్డ్ బ్యాంక్ కంట్రీ ఆపరేషన్ హెడ్ పాల్ ప్రోసీ, అర్బన్ ఇన్‌ఫ్రా, ప్రాజెక్ట్ లీడ్ నటాలియా కే, డిజిటల్ డెవలప్‌మెంట్ సీనియర్ స్పెషలిస్ట్ మహిమాపత్ రే, ఇతర ముఖ్యులు పాల్గొన్నారు.

## అమృత్ టెండర్లపై దుష్ప్రచారం

- నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా
- లేకుంటే కెటిఆర్ రాజీనామా చేస్తారా
- కేటీఆర్‌పై పరువునష్టం దావా వేస్తా
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



.. 2లో

## మూసీ ప్రక్షాళనలో మరో అడుగు

- నిర్వాసితులకు డబుల్ ఇళ్లు
- పిల్లిగుడిసల ప్రాంతాన్ని పరిశీలించిన పొన్నం



.. 5లో



.. 2లో

## కోకాపేటలో అక్రమ కట్టడాల కూల్చివేత

కొనసాగుతున్న హైడ్రా చర్యలు

## అరికెపూడి నేతృత్వంలో తొలి పీఏసీ భేటీ

- సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్
- ఛైర్మన్ నియామకమే తప్పన్న ప్రశాంత్ రెడ్డి



.. 3లో

## గ్రీన్‌కార్డు హోల్డర్లకు శుభవార్త

36 నెలలకు వ్యాలిడిటీ పొడిగింపు

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

2
ఆదివారం
22 సెప్టెంబర్ 2024


## కొండా లక్ష్మణ్ బాపూజీకి సీఎం రేవంత్ నివాళి



**హైదరాబాద్, ప్రజానావ:** తొలి, మలి దశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీని సీఎం రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. తన నివాసంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. 1969లో తన మంత్రి పదవిని సైతం వదులుకున్న త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేగా, శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవ చేయటంతో పాటు నిరంతరం బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి బాపూజీ తపించారన్నారు. కాగా, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఈ నెల 27న అధికారికంగా నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు.

## మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్స్

- ఐటీఐల్లో సిలబస్ మార్పులు చేయాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచన



**హైదరాబాద్, ప్రజానావ:** మార్కెట్ అవసరాలకు అనుగుణమైన కోర్సులను ఐటీఐ ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కోర్సులకు అవసరమైన సిలబస్ రూపకల్పనకు కమిటీని నియమించి, నిపుణులు, విద్యావేత్తలు సలహాలు, సూచనలు స్వీకరించాలని ఆదేశించారు. సచివాలయంలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ప్రతి ఐటీఐ కళాశాలలకు ప్రిన్సిపాళ్లు ఉండేలా చూడాలని, శిక్షణ తీసుకుంటున్న వారికి సమగ్రమైన శిక్షణ అందేలా జాగ్రత్తపడాలని సూచించారు. ఐటీఐ కళాశాలల పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లోనూ కొత్త ఏటీసీలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఐటీఐ, ఏటీసీలేని అసెంబ్లీ సెగ్మెంట్లను గుర్తించి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరం మినహా 100 నియోజకవర్గాల్లో ఐటీఐ, ఏటీసీలు ఉండేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. వృత్తి నైపుణ్యం అందించే ఐటీఐ, ఏటీసీ, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తెచ్చేలా విధి విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## కోకాపేటలో అక్రమ కట్టడాల కూల్చివేత

**హైదరాబాద్, ప్రజానావ:** హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నగర శివారులోని నార్సింగి మున్సిపాలిటీలో గండిపేట మండల రెవెన్యూ అధికారులు, నార్సింగి మున్సిపాలిటీ అధికారులు అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించారు. కోకాపేట్‌లో సర్వే నంబర్ 147లో కొందరు ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా నిర్మించారు. దీంతో అధికారులు జేసీబీల సహాయంతో అక్రమ నిర్మాణాల కూల్చివేత చేపట్టారు. మరోపక్క నార్సింగి మున్సిపాలిటీలోని అక్రమంగా నిర్మించిన భవనాన్ని మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. భవనానికి జి ప్లస్ 2 అనుమతులు తీసుకున్న వ్యక్తి జి ప్లస్ 5 నిర్మాణం చేపట్టాడు. అంటే 3 అంతస్తులు అదనంగా నిర్మించాడు. దీంతో భారీబందోబస్తు నడుమ అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని గండిపేట్ తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మరోవైపు బాధితులు మాత్రం అన్ని అనుమతులు తీసుకున్న తర్వాత డోర్ నంబర్,విద్యుత్ మీటర్లు పొందామని ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టు పక్కల పెద్ద పెద్ద భవనాలు నిర్మాణం చేపట్టినా వాటిని కూల్చివేయకుండా నిరుపేదలైన తమ ఇళ్లను మాత్రమే కూల్చివేశారంటూ బాధితులు ఆందోళనకు దిగారు.

## హైదరాబాద్ వర్షాలపై ప్రభుత్వం అప్రమత్తం

### అధికారులకు సూచనలు చేసిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, ప్రజానావ:** హైదరాబాద్ మహానగరంలో భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ వర్షం పడడంతో నాళాల వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు. మాన్ హోల్స్ వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో హైదరాబాద్ మహానగరంలో వచ్చే రెండు గంటల పాటు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ వర్క్స్, విద్యుత్ ,పోలీస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు , ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాల్లో ,ముంపు ప్రాంతాల్లో ఇబ్బందులు లేకుండా ఉండడంతో పాటు , ప్రాణ నష్టం జరగకుండా చూసుకోవాలని అధికారులను అలర్ట్ చేశారు. హైదరాబాద్ లో భారీ వర్షం కురిసినప్పుడు నీళ్ళు నిల్వ ఉండే 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. ప్రత్యేక బృందాలు అక్కడే ఉండి నీళ్ళు వెంటనే వెళ్ళేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైతే వర్షం కురిసి ఇబ్బందులు ఉన్నాయో ఆయా ప్రాంతాల్లో అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్య తీవ్రమైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అధిక వర్షపాతం ఉన్న ప్రదేశాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇక్కడ జీహెచ్ఎంసి బృందాలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

## కాళేశ్వరానికి.. మల్లన్న సాగర్‌కు సంబంధం ఏమిటి

### హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రి పొన్నం

**హైదరాబాద్, ప్రజానావ:** మల్లన్నసాగర్‌కు వచ్చిన నీళ్లు కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎల్లంపల్లి నుంచి పంపు చేసినవే తప్ప అందులో కాళేశ్వరం నీళ్లు లేవని బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. నిపుణుల సూచన మేరకు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం గేట్లు తెరిచే ఉంచామని అందువల్ల అక్కడి నుంచి నీటిని ఎల్లంపల్లికి ఎత్తిపోసే అవకాశం లేదన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం కొట్టుకుపోతే ఈ నీళ్ళెక్కడివి అంటూ బిఆర్ఎస్ నేతలతో కలిసి హరీశ్ రావు శుక్రవారం మల్లన్నసాగర్‌ను సందర్శించి సందర్భంగా చేసిన వ్యాఖ్యలకు పొన్నం కౌంటర్ ఇచ్చారు. మల్లన్న సాగర్‌లో ఉన్న నీళ్లకు కాళేశ్వరంకు ఏం సంబంధం అని మంత్రి ప్రశ్నించారు. ప్రతిపక్షం గుడ్డిగా మాట్లాడుతుందని ఆయన మండిపడ్డారు. వాస్తవాలు చెప్పాలన్నదే తమ ప్రయత్నం అన్నారు. కాళేశ్వరం పేరుతో కట్టిన ప్రాజెక్టు నిష్ప్రయోజనం అయ్యిందని, ఒక్క చుక్క కూడా వాడుకోలేని పరిస్థితిలో ఉంటే మీ ఫెయిల్యూర్ కప్పిపుచ్చుకునేందుకు బిఆర్ఎస్ నేతలు మల్లన్న సాగర్ వద్ద షో చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇకనైనా బిఆర్ఎస్ నేతలు కాళేశ్వరం విషయంలో ఇటువంటి పనులు మానుకొని తప్పు అంగీకరించాలన్నారు. కాళేశ్వరం విషయంలో రాజకీయాల కంటే రైతులను ఆదుకోవాలన్న చిత్తశుద్ధితోనే కాంగ్రెస్ పనిచేస్తుందని, అందువల్లే ఎల్లంపల్లి నుంచి దాని కింద ఉన్న మిగతా జలాశయాలను నింపుకోగలిగామన్నారు. తమ ప్రభుత్వంపై భగవంతుడి కటాక్షం కూడా ఉందన్నారు. నీటిపారుదల శాఖ మంత్రిగా పని చేసిన హరీశ్ రావు తన అనుభవాన్ని చెబితే చెప్పాలి తప్ప రాజకీయం చేయవద్దని మంత్రి పొన్నం కోరారు.

## జమిలి ముసుగులో దేశాన్ని కబళించే కుట్ర



- ఏచూరి ఉండి ఉంటే ఇలాంటి వాటిపై పోరాడేవారు
- ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది
- సీతారాం ఏచూరి సంస్మరణ సభలో సీఎం రేవంత్

**హైదరాబాద్, ప్రజానావ:** జమిలి ఎన్నికల ముసుగులో దేశాన్ని కబలించాలని బీజేపీ చూస్తోందని.. ఇలాంటి సమయంలో సీతారం ఏచూరి లేకపోవడం దేశానికే తీరని లోటు అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రాల మధ్య ఐక్యత దెబ్బతీసే కుట్ర జమిలి ఎన్నికల రూపంలో ఇప్పుడు జరుగుతుందని ఆయన చెప్పుకొచ్చారు. యూనియన్ ఆఫ్ స్టేట్స్ స్పిరిట్ ను దెబ్బతీసేందుకే బీజేపీ ఈ ఎన్నికల కుట్ర చేస్తోందన్నారు. జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి ప్రజాస్వామిక వ్యతిరేక నిర్ణయాలపై పోరాటం చేయడానికి సీతారాం లేకపోవడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు. రవీంద్రభారతిలో శనివారం జరిగిన సీతారాం ఏచూరి సంస్మరణ సభకు రేవంత్ రెడ్డి హాజరై మాట్లాడారు. చనిపోయాక కూడా ప్రజలకు ఉపయోగపడ్డ గొప్ప నేత సీతారం ఏచూరి అని కొనియాడారు. కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థి దశలోనే రాజకీయాల్లో అడుగుపెట్టిన సీతారాం ఏచూరి దాదాపు నాలుగు దశాబ్దాలుగా జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆర్థికవేత్తగా, సామాజిక కార్యకర్తగా ఏచూరి సేవలు మరువలేనివని, దేశంలో అందరికీ సుపరిచితులయ్యారని చెప్పారు. సీతారాం ఏచూరి లోటు పూడ్చలేనిదని సిఎం అన్నారు. దేశంలో ఏచూరి లాంటి వ్యక్తులు చాలా అరుదు అని గుర్తుచేశారు. రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్ తీసుకురావడంలో ఆయన కృషి గొప్పదని వివరించారు. గతంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటులో కమ్యూనిస్టుల పాత్ర చాలా కీలకమన్నారు. ఉపాది హామి, ఆహార భద్రత పథకాలు కమ్యూనిస్టుల ఆలోచనలతోనే వచ్చాయన్నారు. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉంటారో తెలియని ఈ రోజుల్లో సీతారాం ఏచూరి ఒకే పార్టీలో ఉన్నారని... ఉన్నత కుటుంబంలో పుట్టి.. అణగారిన వర్గాల వారి కోసం సీతారాం ఏచూరి పోరాడారని అన్నారు. సీతారాం ఏచూరి జీవితం య-ువనాయకులకు ఆదర్శమని అన్నారు. ఈ సభలో ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తాను,సీతారాం జేఎన్ యూలో చదువుకున్నామని ..అక్కడే వారితో పరిచయం ఏర్పడిందని తెలిపారు. ఇందిరాగాంధీ యూనివర్సిటీకి వీసీ గా ఉన్నారని.. ఆమె రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చామన్నారు. ఎమర్జన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసి.. ఎత్తివేసిన తరువాత కాలేజీలో చేరామన్నారు. ఏచూరికి హైదరాబాద్ లోనే వామపక్ష భావాలు ఉండేవని.. ఆయన మూడుసార్లు జేఎన్‌యూ అధ్యక్షులుగా పనిచశారని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. క్యాంపస్ లో విద్యార్యుల అణచివేత ఉండొద్దని పోరాటం చేశారు సెక్యూలర్ ప్రజాస్వామిక విలువలు కాపాడటానికి అన్ని పార్టీలను ఏకం చేయడానికి ఏచూరి ఎంతో కృషి చేశారని తెలిపారు. తేడాలు పక్కనపెట్టి దేశాన్ని కాపాడుకోవడమే ఏచూరికిచ్చే నివాళి అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం, సామాజిక న్యాయం ప్రమాదంలో ఉన్నాయని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నం జరుగుతుందని హెచ్చరించారు. ఈ నాలుగు విషయాలు ఏచూరి మన ముందు నిర్దేశిరచిన లక్ష్యాలు అని చెప్పారు. తేడాలను పక్కనపెట్టి దేశాన్ని కాపాడుకోవడమే మన ఏచూరికి ఇచ్చే నివాళులు అని అన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ శనివారం రవీంద్రభారతిలో సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరామ్ మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీతారాం ఏచూరికి నివాళి అర్పించారు.

## 8,888 కోట్ల కుంభకోణం

- అమృత్‌పథకం టెండర్లలో భారీ గోల్‌మాల్
- సొంత బావమరిది కంపెనీకి కట్టబెట్టిన రేవంత్‌రెడ్డి
- బీజేపీ ప్రభుత్వం విచారణ జరిపించాలి
- తెలంగాణలో రేవంత్ కుటుంబ అవినీతి కథాచిత్రం
- ఈ కుంభకోణంతో సీఎం పదవి కోల్పోయే అవకాశం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ
- సీఎం రేవంత్ పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- సాక్ష్యాలను బయటపెట్టిన కేటీఆర్



**హైదరాబాద్, ప్రజానావ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలికల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూపొందించిన అమృత్ పథకంలో సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు అవినీతి చేశారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. సీఎం తన అధికారాన్ని ఉపయోగించి బావమరిదికి పనులు అప్పగించారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బావమరిది కంపెనీకి రూ. 1,137 కోట్ల పనులు అప్పగించారు. రూ. 2 కోట్ల లాభం ఉన్న కంపెనీ రూ. 1000 కోట్ల విలువైన పనులు చేస్తుందా? అమృత్ పథకంలో జరిగిన టెండర్ల వివరాలను ప్రభుత్వం బయటపెట్టడం లేదు. టెండర్లపై కేంద్రం విచారణ జరిపించాలి. ఇప్పటి వరకు జరిగిన అమృత్ పథకం టెండర్లను రద్దు చేయాలి. ఈ టెండర్ల అవినీతిపై కేంద్రానికి లేఖ రాశాం. ప్రభుత్వం చేసిన అక్రమాలన్నీ బయటపెడతాం అని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి అవినీతి కుటుంబ కథాచిత్రం నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన 8,888 కోట్ల రూపాయల అమృత్ టెండర్ల కుంభకోణం గురించి సాక్ష్యాలతో సహా బయటపెట్టారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే.. ఫిబ్రవరి మొదటి వారంలో 8,888 కోట్ల రూపాయల భారీ అవినీతికి సీఎం రేవంత్ రెడ్డి తెరలేపారని కేటీఆర్ విమర్శించారు. తాను బాధ్యతలు నిర్వహిస్తున్న పురపాలక శాఖ కేంద్రంగా రేవంత్ రెడ్డి ఈ కుంభకోణాన్ని చేశారని అన్నారు. ఈ భారీ కుంభకోణంతో రేవంత్ రెడ్డి పదవీ కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి బావమరిది సూదిని సృజన్ రెడ్డి కంపెనీకి అర్హతలు లేకపోయినా వేల కోట్ల రూపాయల పనులను కట్టబెట్టారని విమర్శించారు. ఇండియన్ హ్యూమ్ పైప్ అనే కంపెనీని పిలిపించి బెదిరించి, ఆ కంపెనీ పేరుతో టెండర్లను కట్టబెట్టారని తెలిపారు. పేరుకే ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ అయినా రేవంత్ రెడ్డి బావమరిది కోసం ఈ టెండర్లను కట్టబెట్టారని కేటీఆర్ అన్నారు. ఇందులో టెండర్ దక్కించుకున్న ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీతో రేవంత్ రెడ్డి బావమరిది జాయింట్ వెంచర్ పేరుతో డ్రామాకు తెరలేపారని తెలిపారు. 1,137 కోట్ల రూపాయల కాంట్రాక్టు గెలుచుకున్న తర్వాత ఆ కంపెనీ 20 శాతం పని చేస్తుందని, రేవంత్ రెడ్డి బావమరిది 80 శాతం వెయ్యి కోట్ల పని చేస్తుందని అంటున్నారని పేర్కొన్నారు. ఐహెచ్‌పీ అనే కంపెనీ ఈ మేరకు సెబీకి సమాచారం ఇచ్చిందని అన్నారు. ఈ కంపెనీని శిఖండి సంస్థగా అడ్డుపెట్టుకొని అనుముల రేవంత్ రెడ్డి, సూదిని సృజన్ రెడ్డి ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్వయంగా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఈ కాంట్రాక్టులు కట్టబెట్టారని అన్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్న పురపాలక శాఖ కేంద్రంగా ఈ భారీ అవినీతికి తెరలేపారని కేటీఆర్ అన్నారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ చట్టం, అవినీతి నిరోధక చట్టం 7, 11, 13 నిబంధనల మేరకు రేవంత్ రెడ్డి విచారణను ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పదవి కోల్పోతారని అన్నారు. తన కుటుంబ సభ్యులకు లబ్ది చేకూరిస్తే, ఆశ్రితపక్షపాతం చూపిస్తే ఈ చట్టం ప్రకారం శిక్షార్హులేనని స్పష్టం చేశారు. ఇవే చట్టాల కింద సోనియా గాంధీ తన పదవిని కోల్పోయిందని గుర్తుచేశారు. 2006లో సోనియా గాంధీ నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ చైర్‌పర్సన్‌గా పదవిలో ఉన్నందుకు ఈ చట్టం ప్రకారం తన పదవిని కోల్పోయిందని తెలిపారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప కూడా అక్రమ మైనింగ్ అనుమతులు తన కుటుంబ సభ్యులకు ఇచ్చినందుకు తన పదవి కోల్పోయారని గుర్తుచేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి 2011లో అశోక్ చవన్ ఆదర్శ కుంభకోణంలో తన పదవి కోల్పోయారని అన్నారు. ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ స్టాక్ ఎక్స్చేంజీలకు సమాచారం ఇవ్వాల్సిన గత్యంతరం వలన ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి దక్కిన వందల కోట్ల రూపాయల టెండర్ బయటకు వచ్చిందని తెలిపారు. వీటికి సంబంధించిన ఒక్క జీవో కూడా ప్రభుత్వం వెబ్‌సైట్‌లో పెట్టడం లేదని అన్నారు. టెండర్ల తాలూకు పూర్తి సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి చేస్తున్న అనేక కుంభకోణాలకు సంబంధించిన వివరాలను ప్రజల ముందు వరుసగా ఉంచుతామని కేటీఆర్ తెలిపారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం, ఫోర్ బ్రదర్స్ సిటీ వంటి కుంభకోణాలను ప్రజల ముందు ఉంచుతామని అన్నారు. బావమరిదికి అమృతం పంచుతూ తెలంగాణ ప్రజలకు విషాన్ని పంచుతున్న రేవంత్ రెడ్డిని ప్రజల ముందు ఎండగడతామని స్పష్టం చేశారు. అమృత్ పథకం అనేది కేంద్ర ప్రభుత్వ పథకమని.. అందుకే ఈ టెండర్లలో జరిగిన అభివృద్ధి అక్రమాలపై నిన్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రులకు లేఖ రాశామని తెలిపారు. ఈ టెండర్లలో జరిగిన అక్రమాలను తేల్చాలని కోరామని అన్నారు. రాష్ట్రంలో బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది ఎంపీలు ఉన్న కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకంలో జరిగిన అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌తో బీజేపీ కుమ్మక్కు కాకపోతే పూర్తిస్థాయి ఎంక్వైరీకి కేంద్రం ఆదేశించాలని డిమాండ్ చేశారు. అమృత్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని అన్నారు. ఈ విషయంలో బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే కేంద్రం పరిధిలోని ఈ పథకంలో జరుగుతున్న అవినీతిపై వెంటనే విచారణకు ఆదేశించాలన్నారు. లేదంటే రేవంత్ రెడ్డికి, కేంద్రంలోని బీజేపీ నేతలకు అవినీతితో సంబంధం ఉందని అనుకోవాల్సి వస్తుందని చెప్పారు.

## అమృత్ టెండర్లపై దుష్ప్రచారం

- నిరూపిస్తే పదవికి రాజీనామా చేస్తా
- లేకుంటే కెటిఆర్ రాజీనామా చేస్తారా
- కేటీఆర్‌పై పరువునష్టం దావా వేస్తా
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, ప్రజానావ:** భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రూ. 8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు కేటీఆర్ నిరూపిస్తే నేను రాజీనామాకు సిద్ధం. నిరూపించలేకపోతే కేటీఆర్ రాజీనామా చేస్తారా? అని సవాల్ చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. టెండర్లను గత ప్రభుత్వమే రూ. 3,616 కోట్ల చొప్పున 3 ప్యాకేజీలుగా పిలిచిందని వివరించారు. పోలింగ్ తేదీకి ఒక్కరోజు ముందే గత ప్రభుత్వం ఈ టెండర్లను కట్టబెట్టిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం కేవలం రూ. 3,516 కోట్ల పనులకే టెండర్లు పిలిచింది. గత ప్రభుత్వంలో మిషన్ భగీరథ పేరు మీద రూ. 39వేల కోట్ల ప్రజాధనం లూటీ చేశారు. విమర్శనాత్మకంగా ఉండే విమర్శలు చేయాలని కేటీఆర్‌కు సూచిస్తున్నట్లు వెల్లడించారు. ఆధారాలతో కూడిన విమర్శలు చేయాలి. ఖమ్మంలో నాపై పోటీ చేసిన ఉపేందర్‌రెడ్డి అల్లుడు సృజన్‌రెడ్డి ఒకటి దక్కించుకున్నారు. టెండర్లు వేయొద్దని ఏ కంపెనీని కూడా ప్రభుత్వంలోని పెద్దలు బెదిరించలేదు. మేం పిలిచిన రీ టెండర్లలో గతంకంటే రూ. 54 కోట్లు తక్కువకే బిడ్లు వచ్చాయని మంత్రి పొంగులేటి వివరించారు.కేటీఆర్ వ్యాఖ్యలపై పరువునష్టం దావా వేస్తామన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అమృత్ పథకంలో రూ. 8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు కేటీఆర్ నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. ఒక వేళ కేటీఆర్ తన ఆరోపణలను నిరూపించకపోతే రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. తన సవాల్ ను కేటీఆర్ స్వీకరిస్తే సెప్టెంబర్ 22న ఉదయం ఎక్కడికైనా వస్తానన్నారు. స్పీకర్ ఫార్మాట్లో ఇద్దరం రాజీనామా చేద్దాం అంటూ కేటీఆర్ కు సవాల్ విసిరారు పొంగులేటి. టెండర్లను గత సర్కారే 3,616 కోట్ల చొప్పున 3 ప్యాకేజీలు పిలిచిందన్నారు పోలింగ్ తేదీకి ఒక్కరోజు ముందే టెండర్లను కట్టబెట్టిందన్నారు.

## హ్యాష్ ఆయిల్, గంజాయి చాక్లెట్ విక్రేతల పట్టివేత



**హైదరాబాద్, ప్రజానావ:** ఒరిస్సా నుంచి హ్యాష్ ఆయిల్, బీహార్ నుంచి గంజాయి చాక్లెట్ తీసుకువచ్చి హైదరాబాద్ లో విక్రయిస్తున్న ముఠాలను పట్టుకున్నట్లు రాచకొండ సీపీ సుదీర్ బాబు తెలిపారు. ఇరత రాష్ట్రాల నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్ లో విక్రయిస్తున్న వారిని అరెస్ట్ చేశారు. నిందితులు వైజాగ్ నుంచి హ్యాష్ ఆయిల్ తక్కువ రేటుకు తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్లులో ప్యాక్ చేసి హైదరాబాద్ లో ఎక్కువ రేటుకు విక్రయిస్తున్నారు. ఈ ముఠాలో మొత్తం ఐదుగురు నిందితులు ఉన్నారని.. వారిలో రంజిత్ కుమార్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడని పోలీసులు వెల్లడించారు. అతను డ్రైవర్ గా ఉంటూ డ్రగ్స్ పెడ్లర్ గా చేస్తున్నాడని తెలిపారు. నిందితుల నుంచి 2.3 కేజీల హ్యాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో 3.8 కేజీల గంజాయి చా÷–లకెట్లను సీజ్ చేశారు. గంజాయి చా÷–లకెట్లను గుర్తించడం కష్టం కాబట్టి నిందితులు చాలా తేలిగ్గా వీటిని విక్రయిస్తున్నారని సీపీ సుధీర్ బాబు చెప్పారు. సంతోష్, బీరేందర్ సింగ్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారు బీహార్ కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.



# శాంతితోనే ఏదైనా సాధించవచ్చు

### కన్హా సెంటర్ కార్యక్రమాలు అభినందనీయం: ఉత్తమ్

**రంగారెడ్డి, ప్రజానావ:** శాంతియుత వాతావరణమే మానవ అభివృద్ధికి కారకమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శాంతితో ఏదైనా సాధించవచ్చన్నారు. రంగారెడ్డి జిల్లా నంది గామ మండలం కన్హా శాంతివనంలో 3 రోజుల పాటు యువ సమ్మేళనం జరుగుతుంది. రెండో రోజు శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్టిన్ రైజర్ (వరల్డ్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు), నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఇంకా ఈ సదస్సుకు పలు దేశాలకు చెందిన వివిధ రంగాల యువత హాజరయ్యారు. ఈ సభలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ..... ప్రపంచ వ్యాప్తంగా కొన్ని చోట్ల యుద్ధ వాతావరణం ఉందని .. ఇలాంటి సమయంలో శాంతి, సామరస్యం, సద్భావన పెంచడానికి రామకృష్ణ మిషన్ చేస్తున్న కృషిని అభినందించారు. గతంలో బంజరు భూమిగా ఉన్న కన్హా ప్రాంతాన్ని అద్భుతం గా తీర్చిదిద్దామని, కాంగ్రెస్ ప్రభుత్వం తరపున కన్హా సెంటర్ కు సహాయ సహకారాలుంటాయని అన్నారు. మెడిటేషన్, స్పిరిట్యుయల్ లో కన్హా వాళ్ళు చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. కన్హా లో కార్యక్రమాల్లో పాల్గొంటే సమాజానికి మేలు జరుగుతుందన్నారు.

## హరీష్‌రావును కాకుండా అరికెపూడిని ఎలా నియమిస్తారు

- పీఏసీ ఛైర్మన్‌ను ఎన్నుకున్నారా! ఎంపిక చేశారా?
- స్పీకర్‌ను సూటిగానే ప్రశ్నించామన్న వేముల, గంగుల



**హైదరాబాద్, ప్రజానావ:** ప్రతిపక్ష పార్టీలకు దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీని కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. పీఏసీ సమావేశానికి వచ్చాం.. కానీ మీటింగ్ ప్రారంభంలోనే పీఏసీ నియామకంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అడిగామని తెలిపారు. కమిటీని ఎన్నుకున్నారా.. సెలక్షన్ చేశారా అని అడిగామన్నారు. శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి , గంగుల కమలాకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ...రూల్ 250 ప్రకారం పీఏసీ కమిటీని ఎన్నుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం కోరామని అన్నారు. అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ పేర్లు, మండలి నుంచి ఎల్ రమణ, సత్యవతి రాథోడ్ పేర్లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఇచ్చామని చెప్పారు. కానీ హరీష్‌రావు పేరు లేకుండా అరికపూడి గాంధీ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. పీఏసీ ఛైర్మన్‌ను ప్రతిపక్ష పార్టీ నియమిస్తుందని గుర్తుచేశారు. తాము అధికారంలో ఉన్నప్పుడు పీఏసీ ఛైర్మన్‌గా ప్రతిపక్ష పార్టీలకే పీఏసీ ఛైర్మన్ పదవి ఇచ్చినట్లు గుర్తుచేశారు. గతంలో కూడా ప్రతిపక్ష పార్టీలో ఉన్న నేతలే పీఏసీ ఛైర్మన్లు అయ్యారని వివరించారు. కేంద్రంలో కూడా ఇదే ఫార్ములా ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలకే పీఏసీ ఛైర్మన్‌గా చేశారని అన్నారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సూచన మేరకే లోక్‌సభలో కేసీ వేణుగోపాల్ పీఏసీ ఛైర్మన్ అయ్యారని గుర్తుచేశారు. నియామకంపై స్పీకర్‌ను అడిగితే ఆయన ఒక్కమాట కూడా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అన్నింటికీ మంత్రి శ్రీధర్ బాబు సమాధానం ఎలా చెబుతారని నిలదీశారు. పీఏసీ నియామకంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని విమర్శించారు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి నిరసన తెలిపామని చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గంగుల కమలాకర్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీల పేర్లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఇచ్చామని గుర్తుచేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చాలా కీలకమని చెప్పారు. తాము అన్ని గమనిస్తామన్నారు. ఈ విషయంపై తెలంగాణ హై కోర్టును కూడా ఆశ్రయిస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ స్పీకర్‌ను కలుద్దామని చూస్తే ఆయన వెళ్లిపోయారని అన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఓడిపోయిన కాంగ్రెస్ నేతలకు కూడా నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ప్రోటోకాల్ పాటించడం లేదని ప్రశ్నించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేల హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శలు చేశారు. కల్యాణ లక్ష్మి చెక్కులు కూడా కాంగ్రెస్ నేతలే పంచుతున్నారని.. గెలిచిన ఎమ్మెల్యేలు ఏం చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## యథా రాజా తథా పోలీసులు

### ప్రభుత్వ తీరుపై హరీష్ మండిపాటు



**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ బ్రాండ్‌కు కొందరి తీరు కారణంగా అవినీతి మకిలి పడితే.. సీనియర్ పోలీస్ అధికారులు పడిన కష్టమంతా వృథా అవుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు పోలీసు అధికారులకు సంబంధించి అవినీతి ఆరోపణలపై వచ్చిన కథనాలపై ఎక్స్ వేదికగా స్పందించారు. యువ అఖిల భారత సర్వీస్ అధికారులకు ప్రభుత్వాలు ఆదర్శంగా ఉండి, వాళ్లకి పని పట్ల నిబద్ధత, ప్రజా సేవ పట్ల అంకితభావాన్ని నేర్పించాలన్నారు. కానీ 'యథా రాజా తథా పోలీసులు' అన్నట్లు రాష్ట్రంలో పరిస్థితి తయారైందని వ్యాఖ్యానించారు. భారాస అధినేత కేసీఆర్ ఆలోచనలతో గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దామని, ఆ ప్రక్రియలో ఎందరో తెలంగాణ సీనియర్ ఐపీఎస్ పోలీస్ అధికారుల పాత్ర కచ్చితంగా ఉందన్నారు. అలాంటి తెలంగాణ రాష్ట్ర పోలీస్ బ్రాండ్‌కు కొందరి తీరు కారణంగా అవినీతి మకిలి పడితే పోలీస్ అధికారులు పడ్డ కష్టమంతా వృథా అవుతుందన్నారు. ఒక్కసారి ఈ విషయాన్ని తెలంగాణ సీనియర్ పోలీస్ అధికారులు పునరాలోచించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి సూచించారు.

- సమావేశాన్ని బహిష్కరించిన బిఆర్ఎస్
- ఛైర్మన్ నయామకమే తప్పన్న ప్రశాంత్‌రెడ్డి

# అరికెపూడి నేతృత్వంలో తొలి పీఏసీ భేటీ



**హైదరాబాద్, ప్రజానావ:** తొలిసారి ఏర్పడ్డ పిఏసి భేటీని విపక్ష బిఆర్ఎస్ బహిష్కరించింది. తెలంగాణ అసెంబ్లీ కమిటీ హాల్‌లో పీఏసీ సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ అరెకపూడి గాంధీ అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, పీఏసీ సభ్యులు హాజరయ్యారు. పీఏసీ సమావేశాన్ని భారాస సభ్యులు బహిష్కరించారు. ఛైర్మన్‌గా అరెకపూడి గాంధీని నియమించడంపై శ్రీధర్‌బాబును నిలదీశారు. పీఏసీ ఎంపిక తీరును నిరసిస్తూ సమావేశాన్ని బహిష్కరించామని భారాస నేత ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఎంపిక అప్రజాస్వామికంగా జరిగిందన్నారు. ఇటీవల పీఏసీ ఛైర్మన్‌గా అరెకపూడి గాంధీని నియమించ డాన్ని భారాస నేతలు విమర్శించారు. ఈక్రమంలో భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, గాంధీ సవాళ్లు, ప్రతిసవాళ్లు చేసుకున్నారు. అరికెపూడి నియామకం తరవాత శనివారం తొలిసారిగా పీఏసీ సమావేశమైంది. అరికెపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మంత్రులతోపాటు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన కాసేపటికే బీఆర్ఎస్ నేతలు మంత్రులతో వాగ్వాదానికి దిగారు. అర్హత లేని గాంధీకి పీఏసీ ఛైర్మన్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యకు నిరసనగా తాము సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఉదయం 11 గంటల తర్వాత సమావేశమైన ప్రజాపద్దుల కమిటీ సమావేశానికి మంత్రులు శ్రీధర్ బాబుతోపాటు సభ్యులైన ప్రశాంత్ రెడ్డి, రావూరి ప్రకాశ్ రెడ్డి, వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, గంగుల కమలాకర్, రామ్‌రావు పవార్, అహ్మద్ బిన్న అబ్దుల్లా బలాల,కూనంనేని సాంబశివరావు సహా ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, బానుప్రసాద్‌రావు, జీవన్ రెడ్డి, ఎల్ రమణ హాజరయ్యారు. అసెంబ్లీ కమిటీలో హాల్‌లో జరిగిన సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికి వివాదం మొదలైంది. అరికెపూడి గాంధీని పీఏసీ ఛైర్న్‌గా నియమించడంపై బీఆర్ఎస్ సభ్యులు నిలదీశారు. ఎంపిక తీరు సరిగా లేదని వాగ్వాదానికి దిగారు. ఈ నియామకంలో కక్షపూరితంగా వ్యవహరించారని అందుకే ఈ భేటీని బహిష్కరిస్తున్నట్టు ప్రశాంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఎవర్నీ సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణం తీసుకున్నట్టు వెల్లడించారు. ÷ూష్ట్రంలో ప్రభుత్వ పనితీరును, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా కొన్ని కమిటీలు ఉంటాయి. వాటిలో ఒకటే ఈ ప్రజాపద్దుల కమిటీ. ఇందులో 9 మంది సభ్యులు ఉంటారు. ఇందులో ఛైర్మన్ పదవి మాత్రం ప్రతిపక్షంలో ఉన్న ప్రధాన పార్టీకి లభిస్తుంది. సభ్యుల సంఖ్య కూడా ఆయా పార్టీల సంఖ్యాబలం బట్టి కేటాయిస్తారు. ఇక్కడే వివాదం నెలకొంది. అధికారంగా కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తికి పీఏసీ ఛైర్మన్ ఇవ్వడంపై బీఆర్సీ మండిపడింది. ఆ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర పదజాలంతో పార్టీ మారిన వ్యక్తులను టా÷–గ్గ్ర÷ట్ చేశారు. దీంతో రెండు రోజుల పాటు మెదక్ అంతా అల్లాడిపోయింది.

## అసలుసిసలైన హైదరాబాద్ బిడ్డ సీతారాం ఏచూరీ

- నమ్మిన సిద్ధాంతం కోసం కడదాకా నడిచిన కమ్యూనిస్ట్
- ఏచూరీతో మా బంధం రక్త సంబంధం
- రవీంద్రభారతి సంస్మరణలో కేటీఆర్

**హైదరాబాద్, ప్రజానావ:** అసలుసిసలైన హైదరాబాద్ బిడ్డ సీతారాం ఏచూరీ అని బిఆర్ఎస్ నేతల కెటిఆర్ పేర్కొన్నారు. ఓట్ల రాజకీయంలో వెనుకబడినా.. తాము ప్రజల కోసం పోరాటంలో ముందున్నామని చాటిచెప్పిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరీ అని కేటీఆర్ అన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ సంస్మరణ సభలో కేటీఆర్ సంచలన కామెంట్స్ చేశారు. సీతారాం ఏచూరి గొప్పదనాన్ని కీర్తించారు. ఉద్యమం నుంచి వచ్చిన బిడ్డలుగా ఏచూరీతో మాబంధం రక్త సంబంధం అని అన్నారు. నమ్మిన సిద్ధాంత కోసం ఆఖరి వరకు పోరాడిన ఏచూరీ జీవితం తమ లాంటి వారికి ఆదర్శం అని పేర్కొన్నారు. ఎప్పుడు కండువా మార్చుతారో తెలియని కాలంలో సీతారాం ఏచూరి జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. ఫిరాయింపుల కాలంలో పదవుల కోసం కాకుండా.. సిద్ధాంతం కోసం పని చేసిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరీ అని కీర్తించారు. తిట్లు, బూతులు చలామణి అవుతోన్న ప్రస్తుత రాజకీయాల్లో ఏచూరీ రాజకీయ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న కుటుంబంలో పుట్టినప్పటికీ.. ప్రజల కష్టం తెలిసిన వ్యక్తి ఏచూరీ అని.. ఇందిరా గాంధీని రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన ఏకైక వ్యక్తి అన్నారు. దీన్ని బట్టే సీతారం ఏచూరీ గుండె ధైర్యం ఏంటో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రశ్నించటమే ప్రజాస్వామ్యం అని నమ్మిన వ్యక్తి ఏచూరీ అని కీర్తించారు.

రవీంద్ర భారతిలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ సంస్మరణ సభ జరిగింది. ఈ సంస్మరణ సభకు కేటీఆర్, కోదండరాం, తమ్మినేని వీరభద్రం, బీవీ రాఘవులు, మోహన్ కందా, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, తదితరులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరికాసేపట్లో ఈ సమావేశానికి హాజరవనుండగా.. కేటీఆర్ తన






ప్రసంగం ముగిసిన వెంటనే సభ నుంచి వెళ్లిపోయారు. పదవుల చుట్టూ పరిభ్రమించే ఈనాటి రాజకీయాల్లో స్థిరంగా, సిద్ధాంతం కోసం నిలబడ్డ నాయకుడు సీతారాం ఏచూరి కేటీఆర్ తెలిపారు. ఎప్పుడు ఏ కండువా మారుస్తారో తెలియని ఫిరాయింపుల కాలంలో కడదాకా కమ్యూనిస్టుగా బతికిన ఆదర్శ నేత ఏచూరి మాత్రమే అని కేటీఆర్ పేర్కొన్నారు. కామ్రేడ్ చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం సీతారాం ఏచూరిని ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగించారు.

ఓట్ల రాజకీయం వేరు.. ప్రజల రాజకీయం వేరు. మేం ఓట్ల రాజకీయంలో వెనుకబడ్డ ప్రజల కోసం పోరాటంలో మాత్రం ముందున్నాం.. ప్రజల మనసుల్లో ఉన్నామని ఏచూరి చెప్పిన మాట గుర్తుంది. నాయకులుగా, పాలకులుగా ఉండి పోరాడాలంటే తెలియని వారు ఎందరో ఉండొచ్చు. ప్రజలను ఓటు బ్యాంకుగా చూసేవారు మరెందరో ఉన్నారు. కానీ ఉన్నత చదువులు చదువుకున్న ఓ కుటుంబంలో పుట్టి అణగారిన వర్గాల కోసం ప్రశ్నించే గొంతుకగా ఎదిగిన గొప్ప వ్యక్తిత్వం ఏచూరిది. అది చాలా గొప్ప విషయం. పోరాటాల నుంచి వచ్చిన నాయకులకు ప్రజల కష్టం, నష్టం తెలుస్తుందంటారు.. అలాంటి వారిలో ఏచూరి ఒక్కరే అని బలంగా నమ్ముతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. ఏచూరి హుందాతనం భవిష్యత్ నాయకులకు ఒక పాఠం అని చెప్పక తప్పదని కేటీఆర్ తెలిపారు. రాజ్యాంగాన్ని రాజకీయం కోసం అపహాస్యం చేస్తున్న ఈ రోజుల్లో రాజ్యాంగాన్ని త్రికరణ శుద్ధితో నమ్మిన వ్యక్తి సీతారాం ఏచూరి. ప్రశ్నించడమే ప్రజాస్వామ్యం అని గుండెల నిండా నమ్మిన వ్యక్తి సీతారాం ఏచూరి. పదవులతోనే కీర్తి వస్తుందని అనుకునే వారు కొందరు ఉంటారు. కానీ పదవులు లేకున్నా ఐడియాలజీ, ప్రజా సమస్యల పట్ల అవగాహన, పని చేయాలన్న తపన, నిత్యం ప్రజా సంక్షేమం కోసం పని చేసే ఆలోచన, నిత్యం కొత్తది నేర్చుకోవాలనే అభిలాష, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా చిరంజీవిగా నిలబడేలా చేస్తుందనడానికి ఏచూరి జీవితం ఒక ఉదాహరణగా నేను భావిస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలకు అండగా నిలబడుదాం.. అదే మనందరం ఏచూరికి మనస్ఫూర్తిగా ఇవ్వగలిగే నివాళి అని భావిస్తున్నాను. నమ్మిన సిద్ధాంతం కోసం ఆఖరి వరకు కట్టుబడి పోరాడిన సీతారాం ఏచూరి జీవితం మా లాంటి కొత్త తరం నాయకులకు కూడా ఆదర్శం అని కేటీఆర్ తెలిపారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# అన్యమతస్థుల వల్లనే తిరుమలలో ఈ దుస్థితి



**తిరుమల, ప్రజానావ:** తిరుమల లడ్డూకు జరిగిన అపచారం విషయంలో నిజానిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కల్తీ నెయ్యి అదికూడా జంతువుల కొవ్వు కలిపిన నెయ్యి వాడిన విషయం కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసింది. ఇందులో దోషం ఉంటే గత ఐదేళ్లుగా సాగిన వ్యవహారంపై నిజాయితీగా విచారణ జరగాలి. దోషులను కఠినంగా శిక్షించాలి. అన్యమతస్థులకు తిరుమల తిరుపతి దేవస్థానం వ్యవహారాల్లో స్థానం లేకుండా చేయాలి. హిందూ దేవాలయాల్లో అన్యమతస్థుల జోక్యం, పెత్తనం లేకుండా చేయాలి. ఇప్పటికైనా ధర్మసంస్థలు ముందుకు రావాలి. రాజకియ నేతలను తిరుమల బోర్డులో లేకుండా చేయాలి. జాతీయ స్థాయిలో హిందూధర్మ ప్రచారపరిషత్ ఏర్పడాలి. దేవాలయాల్లో ఇతరుల, రాజకీయాల పెత్తనం లేకుండా చేయాలి. అలాగే కల్తీ నెట్టి విషయంలో తక్షణమే చర్యలకు ఉపక్రమించాలి. ఇకపోతే కల్తీనెయ్యి ఉపయోగించారన్న విసయం బయటకు రాగానే గతంలో సిఎంగా పనిచేసిన జగన్, ఆయన హయాంలో టిటిడి ఛైర్మన్లుగా పనిచేసిన వారు రాజకీయ విమర్శలు చేయడం ఇంకా పాపం. వారి మనోభావాలు దెబ్బతినే వ్యవహారం కాదు కనుక దీనిని రాజకీయ కోణంలోనే చూశారు. చంద్రబాబు రాజకీయ ఎత్తుగడలు అని జగన్ వ్యాఖ్యానించడానికి మించిన పాపం మరోటి కాదు. నిజానికి ఈ వ్యవహార మంతా జగన్ కనుసన్నల్లోనే జరిగిందని భావించాలి. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడారన్న విషయం బయటకు రావడంతో వైసీపీ అధ్యక్షులు జగన్ కించిత్ కూడా భయం లేదా బాధను వ్యక్తం చేయడం లేదు. ఇదేదో చంద్రబాబు వ్యవహారంగా కొట్టి పారేశారు. ఇలా జరిగిన విషయం తెలియగానే అందుకు కారకులైన వారిపై చర్య తీసుకోవాలని కోరుతారని అంతా భావించారు. కానీ చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ అంటూ చేసిన ప్రకటన ఈ దోషం నుంచి తప్పించుకునే చర్యలకు పరాకాష్టగా చూడాలి. వైకాపా పార్టీ శ్రేణులు జగన్ వైఖరిపై తమ అభిప్రాయాలను చెప్పాలి. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలోనే.. జగన్ తాబేదారులు అయిన అన్యమతస్థులు టిటిడి ఛైర్మన్లుగా ఉన్న సమయంలోనే ... తిరుపతి లడ్డూ నాణ్యత, రుచి తగ్గిందంటూ వరుస ఆరోపణలు వచ్చాయి. ప్రసాదం లడ్డూ నాణ్యతలో రాజీపడేది లేదంటూ అప్పటి ప్రభుత్వం వివరణ ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రసాదం తయారీలో రుచిని పెంచేది నాణ్యమైన నెయ్యి. ఆవునెయ్యి ఔషధ గుణాలు కలిగి ఉంటుంది. అందుకే వైద్యశాస్త్రంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఆయుర్వేద వైద్యంలో దీనిని విరివిగా ఉపయోగిస్తారు. అలాంటి ఆవునెయ్యి రోజుకు వందల కిలోలు తిరుమల శ్రీవారి లడ్డూ తరయారీలో వినియోగానికి అవసరం. ఇలాంటి నెయ్యి విషయంలో, స్వామి వారికి నైవేద్యం విషయంలో ఇతర మతాల వారికి విశ్వాసం ఉండకపోవచ్చు. ఇప్పుడు అదే జరిగింది.

గత ఐదేళ్లో తిరుమలలో ఇంకేం జరిగిందన్నది కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఉంది. ఎందుకంటే శ్రీవారికి ఆవు నెయ్యి పేరుతో సరఫరా చేసిన నేతిలో కల్తీ జరిగిందంటూ ప్రస్తుతం ల్యాబ్ నివేదికలు బయటపడ్డాయి. దీంతో ఒక్కసారిగా దేశ వ్యాప్తంగా ఈ అంశం కలకలం రేపింది.



కోట్లాది మంది భక్తుల విశ్వాసాలతో ముడిపడి ఉండటంతో ప్రతి ఒక్కరూ ఈ అంశంపై తీవ్రంగానే స్పందించారు. అయితే దీనిని ఖండించి, విచారణ కోరాల్సిన మాజీ ప్రభువులు మాత్రం భిన్నంగా స్పందించారు. ఇది ఎక్కడ తమకు చుట్టుకుం టుందో అని ముందే గ్రహించి, చంద్రబాబుతో ఉన్న రాజకీయ విభేదాలకు ముడిపెట్టారు. జగన్ కల్తీ నెయ్యి మరకలు తనకు అంటకుండా టీడీపీ కూటమి ప్రభుత్వానికి అంటించే ప్రయత్నం చేస్తున్నారు. తమ పార్టీ అధికారంలోకి రాకముందే నెయ్యిలో కల్తీ జరిగిందంటూ ప్రచారం చేసే ప్రయత్నం చేసారు. ఒకవేళ అలా జరిగివుంటే ఆయన తన ఐదేళ్ల కాలంలోనే చంద్రబాబుపై ఎందుకు చర్యలు తీసుకోలేక పోయారన్నది

కూడా ముఖ్యం. అలాగే ఎప్పటి నుంచి కల్తీ జరిగినా విచారణ చేయాల్సిందే. ఒకవేళ చంద్రబాబు హయాంలోనే జరిగినా విచారణ జరగాల్సిందే. నిజానికి తిరుమలలో టిటిడి బోర్డు ఎప్పుడూ నెయ్యి నాణ్యత విషయంలో రాజీపడలేదు. వాస్తవానికి 2014-19 మధ్య కాలంలో అంటే చంద్రబాబు హయాంలో తిరుమలలో ప్రసాదం తయారీకి బ్రాండెండ్ నెయ్యిని ఉపయోగించేవారు. ప్రసాదం తయారీ కోసం నాణ్యత కలిగిన పదార్థాలను మాత్రమే వాడేవారు. నెయ్యి కొరత ఉన్నా తిరుమలలో అధికారులు ఎక్కడా రాజీపడలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెయ్యి నాణ్యత విషయంలో రాజీపడ్డారు. లడ్డూ నాణ్యత తగ్గుతోందన్న ఆరోపణలను పట్టించుకోలేదు. అలాగే ఇష్టం వచ్చినట్లుగా తిరుమల వ్యవహారాలను మార్చేశారు.

అవసరమైన స్వచ్ఛమైన నెయ్యి మార్కెట్‌లో అందుబాటులో లేకపోయినా కల్తీ నెయ్యి వినియోగించారనే విషయం ఇప్పుడు స్పష్టమవుతోంది. తాజాగా ల్యాబ్ రిపోర్టులు నెయ్యిలో కల్తీ జరిగిందని స్పష్టం చేయడంతో వైసీపీ అసలు రంగు బయట పడింది. ఇది ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న వ్యవహారం. అందుకే శ్రీవారి లడ్డూను జంతువుల కొవ్వుతో అపవిత్రం చేసిన వ్యవహారం జాతీయ స్థాయిలో గగ్గోలు రేపుతోంది. లడ్డూ తయారీకి గత ప్రభుత్వం వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసి నట్టు తేలడంతో వైసీపీ నిర్వాకంపై సర్వత్రా ఆగ్రహ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన లడ్డూను కలుషితం చేయడాన్ని కేంద ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దీనిపై కేంద్ర స్థాయిలో విచారణ జరిపించేందుకు సిద్ధమైంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా శుక్రవారం సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హిందూ విశ్వాసాల పట్ల ఇది కుట్ర, ద్రోహం, క్షమించరాని నేరమంటూ కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, గిరిరాజ్ సింగ్, బండి సంజయ్, పలువురు ఎన్డీయే, బీజేపీ జాతీయ నేతలు తీవ్రంగా స్పందించారు. మరోవైపు, 'కలియుగ దైవానికి ఇంత అపచారామా' అంటూ కోట్లాదిమంది భక్తులు, ప్రభుత్వ నేతలు, వివిధ రంగాల ప్రముఖులు చలించి పోతున్నారు. దీనిపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని ఒకవైపు,కేంద్ర దర్యాప్తు సంస్థను రంగంలోకి దింపాలని మరోవైపు ఒత్తిడి పెరిగిపోతోంది.

శ్రీవారినీ, భక్తులనూ కొల్లగొట్టిన జగన్‌ను, అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డిని శిక్షించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, డీజీపీకి లేఖలు అందుతున్నాయి. తిరుమల పవిత్రతను కాపాడాలంటూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రూపంలో పిటిషన్ దాఖలైంది. జగన్‌పైనా, కల్తీ నెయ్యిని సరఫరా చేసిన కాంట్రాక్ట్ సంస్థలపైనా జాతీయ భద్రతా చట్టం కింద చర్య తీసుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు లేఖ రాశారు. ఇది సనాతన ధర్మంపై కుట్ర, దాడిగా పరిగణించాలని అయోధ్య ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మొత్తంగా ఈ వ్యవహారంలో నిగ్గు తేలాలి. దోషులు ఎవరైనా వదిలి పెట్టరాదు.

# ఆత్మరక్షణలో మాజీ సీఎం జగన్

## తప్పును చంద్రబాబపై తోసేసే యత్నం ■ తిరుమల వ్యవహారంలో విచారణ కోరలేని దైన్యం

**అమరావతి, ప్రజానావ:** తిరుపతి లడ్డూ వ్యవహారం బయటపడటంతో జగన్ నిజాయితీ ప్రదర్శించి విచారణ కోరివుంటే బాగుండేది. ఓవైపు హిందూ సమాజం అట్టుడుకుతున్నా దీనిపై నిర్లక్ష్యంగా మాట్లాడారు. అందుకే ఇప్పుడు జగన్ ఐదేళ్ల పాలనను ఓసారి గుర్తుచేసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జగన్ చెప్పేవన్నీ అబద్దాలు.. చేసేవన్నీ మోసాలని ఎన్నికల ఫలితాలతో ప్రజలు తేల్చేశారు. చివరకు సొంత చెల్లెళ్లు వైఎస్ షర్మిల, సునీతలు కూడా జగన్‌ను నమ్మడం లేదు. తండ్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలోనూ ఇంతటి ఘోరం జరగలేదని షర్మిల వాపోయారు. తిరుమలలో జరిగిందని అనుకుంటున్న మొత్తం వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా షర్మిల లేఖ రాశారు. తిరుపతి లడ్డూల తయారీలో ఉపయోగించే నెయ్యిలో కల్తీకి జగన్ ఎలా కారణమవుతారనే వాదనను కొందరు వినిపిస్తున్నారు. ప్రత్యక్షంగా జగన్ కారణం కాకపోయినా.. ప్రపంచ ప్రసిద్ధ పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో ఏం జరుగుతుందనేది తెలుసుకోవల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. టీటీడీ పాలకమండలిని నియమించేది రాష్ట్రప్రభుత్వమే. దీంతో పాలకమండలితో పాటు తిరుమలలో జరిగే పొరపాట్లకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుంది. కల్తీ నెయ్యిని సరఫరా చేస్తుంటే అధికారులు ఏం చేశారు.. అధికారులు నియంత్రించే ప్రయత్నం చేసినా ప్రభుత్వ పెద్దల ఆదేశాల తోనే కల్తీ నెయ్యి సరఫరా జరిగిందా అనేది విచారణలో తేలాల్సిఉంది. మొత్తంగాతిరుమల లడ్డు ప్రసాదంలో ఉపయోగించే నెయ్యి కల్తీ వివాదం రాజకీయ రంగు పులుముకుంది. ఓ వైపు భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. మరోవైపు రాజకీయ నేతలు స్పందిస్తున్నారు. ఒకరు సుప్రీంకోర్టుకు వెళితే...మరొకరు హైకోర్టు తలుపులు తట్టారు. ఇంకొకరు సీబీఐ దర్యాప్తునకు డిమాండ్ చేశారు. ఇక ఈ విషయంపై కేంద్రం కూడా కదిలింది. రాష్ట్ర ప్రభుత్వాన్ని సమగ్ర నివేదిక కోరింది. తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ వ్యవహారం...దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలను పెంచింది. అంతేకాదు తదుపరి ఏం జరుగనుందనే ఆలోచన అందరిలోనూ కలుగుతుంది. పరమ పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ అయిందనే వార్తలు భక్తుల్లో ఆందోళన, ఆగ్రహాన్ని రగిలి స్తున్నాయి. తిరుమల లడ్డూ వివాదంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా స్పందించారు. కల్తీ నెయ్యి ఘటన ఎంతో బాధ కలిగించిందని, ఇలాంటి ఘటనలతో ప్రపంచవ్యాప్తంగా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. దీనిపై లోతైన విచారణ జరపాలన్నారు. ఇదే విషయంపై ఏపీ సీఎం చంద్రబాబుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ రాశారు. అన్యమతస్తులకు టిటిడి పగ్గాలు ఇవ్వడం వల్లే ఈ దుస్థి



తి వచ్చిందన్నారు. సిబిఐతో విచారణ జరిపిస్తేనే వాస్తవాలు నిగ్గు తేలుతాయన్నారు. కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, గిరిరాజ్ సింగ్ కూడా ఈవ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు చెప్పిన మాటలు చాలా తీవ్రమైనవని, ఆ వ్యవహారంపై సమగ్ర విచారణ జరగాలని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. మన మధ్య హిందూ వ్యతిరేకులు ఉన్నారు, మమ్మల్ని క్షమించు వెంకటేశ్వర అంటూ కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ట్వీట్ చేశారు. ఈ విషయంలో ల్యాబ్ రిపోర్ట్ పంపించాలని ఏపీ సీఎం చంద్రబాబును కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కోరారు. ఆ నివేదికపై సమగ్ర పరిశీలన జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని, ఆలయాల పవిత్రత, మత విశ్వాసాలు, సంప్రదాయాలపై అవగాహన ఉన్నవారికే దేవాలయాల నిర్వహణ అప్పగించాలని కోరారు. దోషులను 48 గంటల్లో గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, దీనిపై కాలయాపన చేస్తే ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని బీసీ యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ హెచ్చరించారు. అయితే దోషులు ఎవరన్నది తేలాలి. విచారణ జరగాలి. దీనిని ప్రధానంగా కోరాల్సింది వైసిపియే. కానీ అలా చేయలేదు. తిరుమల లడ్డూ వివాదంపై హైకోర్టును వైసీపీ ఆశ్రయించింది. తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ కోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది ఆ పార్టీ. ఈ విషయంపై సిట్టింగ్ జడ్జి లేదా కోర్టు నియమించిన కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కోరింది. వచ్చే బుధవారం నాడు పిటిషన్‌ను విచారిస్తామంది కోర్టు. సీబీఐ విచారణకు డిమాండ్లు, హైకోర్టు, సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయడంతో.. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. నిజానికి మోసపూర్తి విధానాల కారణంగా జగన్ పాలన అవసరం లేదని ప్రజలు తీర్పునిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ మాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశానంటూ ప్రచారం చేసుకున్నారు. జగన్ పైకి చెప్పేది ఒకటి.. చేసేది మరొకటని తాజాగా ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. జగన్ వ్యవహారశైలి నచ్చకపోవడంతో కొందరు నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. జగన్ ఆలోచనల్లోనే మాయ, మోసం దాగి ఉంటాయనే చర్చ సాగుతోంది. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వివాదంలో టీటీడీ ఈఓ నివేదిక కీలకంగా మారనుంది.. టీటీడీ లడ్డూ కల్తీ నెయ్యి విషయంలో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం ఈఓను ఆదేశించింది. టీటీడీ ఈఓ శనివారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. టెండర్ పక్రియ, పాల్గొన్న సంస్థలు, తక్కువ రేట్ కు కోట్ చేయడం వెనుక కారణాలు అన్నింటితో సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని టీటీడీ ఈఓకు ప్రభుత్వం సూచించింది.. దీంతో ఆ నివేదికను తీసుకుని సీఎం చంద్రబాబును టీటీడీ ఈవో కలవనున్నారు. ఈ సందర్భంగా కల్తీ వివాదం, నెయ్యి కొనుగోలు, రిపోర్టులతోపాటు పలు విషయాల గురించి చంద్రబాబుకు వివరించనున్నారు.





# నాణ్యతను పరీక్షించే ల్యాబ్ ఏర్పాటులో నిర్లక్ష్యం

## అవకాశం ఉన్నా పట్టించుకోని టిటిడి బోర్డు

**తిరుమల, ప్రజానావ:** తిరుమలలో నాణ్యతను పరీక్షించే ల్యాబ్ లేకపోవడం దురదృష్టకరం. నెయ్యి కావచ్చు..ఇతర పదార్థాల నాణ్యతను గుర్తించాలంటే పరీక్షలకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉంది. కలియుగ వైకుంఠనాథుడు శ్రీనివాసుడి దర్శనం కోసం వందల కిలో మీటర్ల ప్రయాణం చేస్తారు. క్షణకాలం పాటు దర్శనం చేసుకుని పునీతులు అవుతారు. తమ కోర్కెలు తీర్చిన భగవంతుడికి తమ వద్ద ఉన్న మేరకు కానుకలు సమర్పిస్తారు. ఇలా ప్రతిరోజు తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులు హుండీ ద్వారా సమర్పించే కానుకలు రూ. 3 నుంచి 5 కోట్లు వరకు రద్దీ దృష్ట్యా మారుతూ ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు మనోభావాలు దెబ్బతిసే పరిస్థితి ఏర్పడింది. టీటీడీ వంటి ధార్మిక సంస్థ చేసే అనేక కార్యక్రమాలు..ఉత్సవాలు..క్యూ లైన్ నిర్వహణ.. టికెట్ల విక్రయం.. ప్రసాదాల తయారీ.. వాటి పంపిణీ.. నిరంతరాయంగా పారిశుద్యం..ప్రకృతి...వసతి సముదా యాలు ఇలా టీటీడీ శ్రీవారి భక్తుల కోసం చేసే పనులు అందరికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. వీటిని చూసి నేర్చుకోవడానికి అనేక దేవాలయాలు అధికారులు పలుమార్లు పర్యటించారు. ఎంతో పవిత్రంగా భావించే స్వామి వారి లడ్డూ, నైవేద్యాల్లో వాడే ముడి సరుకులు పరీక్షించేందుకు టిటిడి ల్యాబ్ ఎందుకు ఏర్పాటు చేయలేదు అనేది భక్తుల ప్రశ్న. టీటీడీ కోరితే కోట్లాది రూపాయలు ఏ రూపంలో అయిన అందించేందుకు వేలాది మంది భక్తులు వేచి ఉన్నారు. టీటీడీ ట్రస్టులకు, విద్య, వైద్య ఇతర కార్యక్రమాలకు సంబంధించి అనేక మంది విరాళాలు సమర్పిస్తుంటారు. ఇలాంటి చోట టీటీడీ ఒక ల్యాబ్ ను అయితే ఏర్పాటు చేసుకుని ఉంది. ఇప్పటి నాయకులు పాలకులు ల్యాబ్ అయితే ఏర్పాటు చేశారు కాని దానికి సంబంధించి నిపుణులు ఎవ్వరు లేరు. 2015, 2016 లో ల్యాబ్ ఏర్పాటు చేసినా పని చేసే వారు లేక మరుగున పడింది. ఇక్కడ నామమాత్రపు తనిఖీ చేసే వారు.. రాను రాను అది పూర్తిగా మరుగున పడిపోయింది. ప్రస్తుతం ఎవరో రిటైర్ అయిన ఉద్యోగి ఇక్కడ నాణ్యత ప్రమాణాలు పరీక్ష చేస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వాలు.. ఇంత మంది పాలకమండలిలు.. అనేక మంది అధికారులు ల్యాబ్ ఏర్పాటు పై దృష్టి పెట్టలేదు. ఇది గత పాలకుల తప్పిదంగా భక్తులు భావిస్తున్నారు. పాలకుల తప్పిదం నేడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ భక్తుల మనోభావాలను దెబ్బ తింటున్నాయి.వీటిలో లడ్డూ వివాదం వేళ తిరుమలకు వచ్చిన నెయ్యిని ల్యాబరేటరీకి పంపారు. వాళ్లతో ఒప్పందం చేసుకుంటే ఆ ల్యాబ్ వాళ్లే నాణ్యత ప్రమాణాలు పాటించే రూ.75 లక్షల విలువైన పరికరాలు దిగుమతి చేసుకుని టీటీడీలో ఆ విభాగం ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇస్తారు. ఈ ఏడాది డిసెంబర్‌లోపు ల్యాబ్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని టీటీడీ ఈవో శ్యామల రావు తెలిపారు.

# రాజకీయ పెత్తనమే తిరుమల పవిత్రతకు దెబ్బ

## రాజకీయ పెత్తనం నుంచి బయటపడేయాలి

**తిరుమల, ప్రజానావ:** తిరుమల తిరుపతి దేవస్థానా లకు ప్రత్యేకమైన వ్యవస్థ ఉంది. పేరుకు స్వతంత్ర బోర్డు ఉంటుంది కానీ.. ప్రభుత్వ కనుసన్నల్లోనే ఉంటుంది. టీటీడీ బోర్డుకు రాజకీయనాయకుల్నే ఛైర్మన్లుగా నియమిస్తున్నారు. సభ్యులుగా రాజకీయ నేతలు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు ఉంటున్నారు. వీరే టీటీడీని నడిపిస్తారు. ఈవోగా ఐఏఎస్ అధికారి ఉన్నప్పటికీ కీలకమైన నిర్ణయాలు రాజకీయ పరంగానే సాగుతాయి. ఎందుకంటే ప్రభుత్వం ఆగ్రహిస్తే ఈవో పదవి ఉండదు. అందుకే ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీ నేతలు ఛైర్మన్లుగా. సభ్యులుగా ఉంటారు. ఈవో వారు చెప్పింది చేస్తారు. ఇక్కడే అక్రమాలకు బీజం పడుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఛైర్మన్ గా వైవీ సబ్బారెడ్డి నాలుగేళ్ల పాటు ఉన్నారు. అలాగే రక్షణ శాఖలో పని చేస్తూ.. డిప్యూటేషన్ మీద ఏపీకి వచ్చిన ధర్మారెడ్డి పూర్తిగా ఐదేళ్ల కాలం అనేక సార్లు తన డిప్యూటేషన్ పొడిగించుకుంటూ తిరుమలలోనే కొనసాగారు చివరికి ఆయనకు ఈవో పోస్టింగ్ ఇచ్చారు. సహజంగానే సీనియర్ ఐఏఎస్‌లకు మాత్రమే ఈవో పోస్టింగ్ ఇస్తారు. అర్హత లేకపోయినా పదవి ఇచ్చారని కొంత మంది కోర్టుల్లోనూ పిటిషన్లు వేశారు. ధర్మారెడ్డి వ్యవహారశైలి.. ఆయన టీటీడీలో పాతుకు పోవడంపై అనేక విమర్శలు వచ్చాయ. చివరిలో భూమన కరుణాకర్ రెడ్డిని టీటీడీ ఛైర్మన్ ను చేశారు. ఆయన పైనా అనేక ఆరోపణలు వచ్చాయి. మొత్తంగా ఐదేళ్ల పాటు టీటీడీ వివాదాల మయంగా మారింది. లడ్డూ ప్రసాదం ఉత్కృష్టమైనది. లడ్డూ పవిత్రత కాపాడటానికి అత్యంత నాణ్యమైన సరుకుల్నే కొనుగోలు చేయాలి. స్వచ్ఛమైన ఆవు నెయ్యి రూ. వెయ్యి వరకూ అవతుందని డెయిరీ నిపుణులు చెబుతారు. మరి టీటీడీ పెద్దలకు ఎందుకు తెలియలేదో కానీ. మూడు వందలకు.. నాలుగు వందలకు ఇస్తామని చెప్పగానే టెండర్లు ఇచ్చేశారు. క్క లీటర్‌కు వంద.. రెండు వందలు నష్టం చేసుకుని వేల లీటర్లు ఏ కంపెనీ మాత్రం సరఫరా చేస్తుంది. అత్యంత నాసిరకం.. కల్తీ నెయ్యిని సరఫరా చేసి దొరికిపోయారు. ఇది చిన్న విషయం కాదు. ప్రపంచవ్యాప్తంగా హిందువుల మనోభావాలను దెబ్బతీసింది. టీటీడీలో గతంలో పని చేసిన పాలక మండళ్లు.. ఇలా రోజువారీ కొనుగోళ్లు..క్వాలిటీ అంశంలో జోక్యం చేసుకోవు. అధికారులే అత్యంత జాగ్రత్తగా ఉంటారు. కానీ గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన టీటీడీ బోర్డు ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుని ప్రతి టెండర్ ఎవరికి దక్కాలో డిసైడ్ చేసుకుని ఆ మేరకు టెండర్లు..రివర్స్ టెండర్ల పక్రియ నిర్వహించేవారన్న ఆరోపణలు వచ్చాయి. అందులో భాగంగానే సామర్థ్యం లేని కంపెనీలు టెండర్లలో పాల్గొని తక్కువ ధరకు సరఫరా చేస్తామని ముందుకు వచ్చినా అంగీకరించారని అంటున్నారు. ఈ కంపెనీలకు టెండర్లు దక్కడం వెనుక కీలక పరిణామాలు ఉన్నాయని.. దర్యాప్తులో అన్నీ బయటకు వస్తాయని అంటున్నారు. టీటీడి లాంటి ఆలయాలను నిర్వహించడం ఆషామాషీ కాదు. స్వార్థ పరుల చేతుల్లో పడితే అనేక సమస్యలు వస్తాయి. దేవుడండే భయం, భక్తి ఉన్న వారు అయితేనే సక్రమంగా నిర్వహించగలరని.. అలాంటి అధ్యాత్మక వాదులకే పాలక మండలిలో చోటు కల్పిస్తేనే పరిస్థితులు మెరుగుపడుతాయన్న వాదన వినిపిస్తోంది.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం
22 సెప్టెంబర్ 2024


# సింగరేణి కార్మికులకు లాభాల్లో కోత

**కార్మికులకు అన్యాయం జరిగిందన్న హరీశ్**



**హైదరాబాద్, ప్రజానావ:** సింగరేణి కార్మికులకు ఇచ్చే లాభాల్లో తెలంగాణ ప్రభుత్వం కోత విధించడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. మొత్తం రూ.4,701 కోట్ల లాభంలో 33 శాతం బోనస్‌గా ప్రకటించాలని భారాస డిమాండ్ చేస్తోందన్నారు. దసరా సందర్భంగా సింగరేణి కార్మికులకు తీపి కబురు బదులు చేదు కబురు చెప్పారని విమర్శించారు. 'లాభాల వాటాల్లో 50శాతం కోత విధిస్తూ కార్మికులకు చేసిన అన్యాయాన్ని భారాస తీవ్రంగా ఖండిస్తోంది. రూ. 4,701 కోట్ల లాభాలు చూపించి, కేవలం రూ.2,412 కోట్లలో 33 శాతం బోనస్‌ను ప్రకటించడం వెనక ఆంతర్యమేంటి? ఆల్‌టైం రికార్డు ఉత్పత్తిని సాధించినా, గతం కంటే ఒక్కో కార్మికుడికి అదనంగా ఇచ్చేది రూ.20 వేలేనా? కార్మికులు చేసిన కష్టానికి, ఫలితం ఇవ్వకపోవడం దారుణం. రాష్ట్రం ఏర్పడిన తొలి సంవత్సరం (2014-15) లోనే సింగరేణి లాభాల నుంచి కార్మికులకు 21 శాతం వాటాను నాటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. సమైక్య రాష్ట్రంలో కార్మికులకు జరిగిన అన్యాయం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోంది' అని హరీశ్‌రావు అన్నారు.

# 28న ఒకరోజు పర్యటనకు హైదరాబాద్‌కు రాష్ట్రపతి

- నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో పాల్గొననున్న ముర్ము
- రాష్ట్రపతి రాకతో ఏర్పాట్లపై అధికారులతో సీఎస్ సమీక్ష



**హైదరాబాద్, ప్రజానావ:** ఈ నెల 28వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు రానున్నారు. నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి హాజరవుతున్నారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులతో సమావేశమై సమీక్షించారు. ముర్ము తన ఒకరోజు పర్యటన సందర్భంగా నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి హాజరవుతారని ఆమె తెలియజేశారు. అనంతరం సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్‌ను ప్రారంభిస్తారు. శాఖల మధ్య సంపూర్ణ సమన్వయం ఉండేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖను కోరారు. అదేవిధంగా, విమానాశ్రయం, రాష్ట్రపతి నిలయం, అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక పరికరాలు ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్రపతి కార్యాలయ అవసరాలకు అనుగుణంగా సహాయక సిబ్బందితో పాటు మహిళా వైద్యుల సేవలను అందుబాటులో ఉంచాలని, అవసరమైన వైద్య ఏర్పాట్లు చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను కోరారు. అదేవిధంగా, రాష్ట్రపతి కాన్వాయ్ ఉపయోగించాల్సిన రోడ్ల మరమ్మతులను కంటోన్మెంట్ బోర్డు, జిహెచ్ఎంసి అధికారులతో సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో పాములు పట్టేవారిని అందుబాటులో ఉంచాలని, అలాగే రాష్ట్రపతి నిలయం పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద, తేనెటీగలు వంటి వాటి నివారణకు ప్రత్యేక బృందాలను జీహెచ్ఎంసీ సమన్వయంతో ఏర్పాటు చేయాలని అటవీ శాఖను ఆదేశించారు. రాష్ట్రపతి సందర్శనకు వెళ్లే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖను ఆదేశించారు. డీజీపీ జితేందర్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డీజీ ÷ర్ సర్వీసెస్ నాగిరెడ్డి, గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పొలిటికల్ కార్యదర్శి రఘునందన్ రావు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సమాచార పౌర సంబంధాల స్పెషల్ కమిషనర్ హనుమంత రావు, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, జీహెచ్ఎంసీ కమిషనర్ అమ్రపాలి, సీఎండీ టీఎస్‌పీడీసీఎల్ ముషారఫ్, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ప్రజల విశ్వాసానికి తూట్లు

- లడ్డూ కల్తీపై కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ప్రజానావ:** కలియుగ ప్రత్యక్ష దైవం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తుల కొంగు బంగారం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న సమాచారం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షులు కిషన్ రెడ్డి అన్నారు. ఈమేరకు కిషన్ రెడ్డి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏటా కోట్లాది మంది దర్శించుకునే తిరుపతి వెంకన్న లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడం అనేది ప్రజల విశ్వాసానికి తూట్లు పొడవడమేనని అన్నారు. హిందువులు ముఖ్యంగా శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆరోపించారు. ఇది క్షమార్హం ఎంత మాత్రం కాదని చెప్పారు. కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీసిన నేరస్థులకు తగిన శిక్ష పడాలని హెచ్చరించారు. ఈ దిశగా పోలీసు యంత్రాంగం, దర్యాప్తు సంస్థలు ముందుకు వెళ్తున్నాయని ఆశిస్తున్నానని అన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, దేశవిదేశాల నుంచి నిత్యం లక్షలాది భక్తులు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు. పరమ పవిత్రమైన, ఎంతో ప్రశస్తమైన లడ్డూ ప్రసాదాన్ని సేవిస్తారని అన్నారు. అప్పుడే తమ దైవ దర్శనం పూర్తయిందని భక్తులు భావిస్తారని అన్నారు. ఇంత పవిత్రంగా భావించే ఈ లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వులను, చేపనూనెలను వినియోగించడం క్షమించరాని నేరమని అన్నారు. ఇలాంటి దురాగతానికి బాధ్యులైన వారందరినీ గుర్తించి, తగిన శిక్ష పడేలా చేయాలని అన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఘటనలేవీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దీంతో పాటు తిరుపతిలో అన్య మత ప్రచారం, తిరుమల కొండపైకి మద్యం, మాంసాహారాన్ని తీసుకెళ్లడం, టీటీడీలో అవినీతి అక్రమాలు గత కొన్నేళ్లుగా పతాక శీర్షికలవుతున్నాయని ఆరోపించారు. సనాతన ధర్మాన్ని, హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసే కుట్ర గతంలో జరిగిన నేపథ్యంలో వీటన్నింటిపై సమగ్ర దర్యాప్తు జరిపించి, బాధ్యులను శిక్షించి, తిరుమల పవిత్రతను కాపాడే, భక్తుల మనోభావాలను పరిరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కోట్లాది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశాన్ని సంచలనాత్మకంగా మార్చవద్దని రాజకీయ పార్టీలకు, ధార్మిక సంస్థలకు విజ్ఞప్తి చేశారు. పదేపదే తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైందన్న వార్తలు భక్తుల నమ్మకం, విశ్వాసం సడలే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో బాధ్యతతో వ్యవహరించి సంయమనం పాటించాలని అన్నారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి నిత్యం వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే లక్షలాది భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు, వారి మనోభావాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

# లాభాలు పెరిగినా బోనస్ తగ్గించారు

**మండిపడ్డ బిఆర్ఎస్ నేత వినోద్ కుమార్**



**హైదరాబాద్, ప్రజానావ:** బోనస్ అనేది సింగరేణి కార్మికుల హక్కు అని బీఆర్ఎస్ నాయకులు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కార్మికుల హక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తుందని మండిపడ్డారు. సింగరేణి సంస్థ 2023-2024 ఆర్థిక సంవత్సరంలో రూ.4,701కోట్ల వాస్తవ లాభాలు ఆర్జించిన, వారికిచ్చే బోనస్‌ను రూ,2,412 కోట్లకు పరిమితం చేయడం కార్మికులను మోసం చేయడమేనని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధి పేరుతో కార్మికులను లాభాల నుంచి పక్కనపెట్టడం సరైన విధానం కాదని బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. ఆల్ టైం రికార్డు ఉత్పత్తి సాధించినప్పటికీ.. గతం కంటే ఒక్కో కార్మికుడికి అదనంగా ఇచ్చేది కేవలం రూ.20 వేలేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. సగం లాభాల నుంచే కార్మికులకు బోనస్ ఇస్తున్నారని తెలిపారు. గత పదేళ్లలో ఇదే అతి తక్కువ బోనస్ అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 2,289 కోట్ల బోనస్‌ను ఎగ్గొట్టడం సరైంది కాదని బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సింగరేణి సంస్థ లాభాలేమో 4,701 కోట్లు చూపించి కేవలం రూ,2,412 కోట్లలో మాత్రమే 33 శాతం బోనస్‌ను ప్రకటించారని తెలిపారు. తాజాగా ప్రభుత్వం ప్రకటించింది 33 శాతం కాదని 16.33 శాతమే అవుతుందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇలా ఎప్పుడూ జరగలేదని అన్నారు. వాస్తవంగా ప్రభుత్వం 4,701.కోట్ల లాభాలకు బోనస్ ప్రకటించి ఉంటే కార్మికులకు రూ,1400 కోట్లకు పైగా బోనస్ దక్కేదని తెలిపారు. ఒక్కో కార్మికుడికి బోనస్ రూపంలో రూ.2లక్షల వరకు వచ్చేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు 50 శాతం గండికొట్టి గొప్పగా ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పొట్టగొడుతోందని మండిపడ్డారు.

# అమెరికాకు భట్టి

**అంతర్జాతీయ మైనింగ్ ఎక్స్‌పోకు హాజరు**



**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అధికారుల బృందం అమెరికా, జపాన్ దేశాల పర్యటనకు బయలుదేరి వెళ్లింది. మైనింగ్, గ్రీన్ పవర్ విభాగాలకు సంబంధించి ఆధునిక పద్ధతులు, లోతైన అధ్యయనంతోపాటు పెట్టుబడులను ఆహ్వానించడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అధికారుల బృందం ఈ రోజు హైదరాబాద్ నుంచి అమెరికాకు బయలుదేరింది. ఈనెల 21 నుంచి అక్టోబర్ 4 వరకు పర్యటన కొనసాగనుంది. మైనింగ్, గ్రీన్ పవర్ విభాగాలకు సంబంధించి ఇంటర్నేషనల్ ఎక్స్-పోతోపాటు, ప్రముఖ కంపెనీల ప్రధాన కార్యాలయాల సందర్శన, పెట్టుబడిదారులతో డిప్యూటీ సీఎం సమావేశం కానున్నారు. ఈనెల 24,25 తేదీల్లో అమెరికాలోని లాస్‌వేగాస్‌లో జరగనున్న అంతర్జాతీయ మైనింగ్ ఎక్స్‌పోలో పాల్గొంటారు. అక్కడ వివిధ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులతో చర్చలు జరుపుతారు. ఈనెల 26న లాస్ ఏంజెల్స్‌కు చేరుకుంటారు. ఈనెల 27న ఎడ్ వార్డ్స్, సన్ బోర్న్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ విధానాన్ని పరిశీలిస్తారు. ఈనెల 28వ తేదీన పెట్టుబడిదారులు, సాంకేతిక నిపుణులతో సమావేశమవుతారు. ఈ నెల 29న టోక్యోకి చేరుకుంటారు. ఈనెల 30న స్థానిక పెట్టుబడిదారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తారు. అక్టోబర్ 1న పెట్టుబడిదారులతో వ్యక్తిగతంగా (వన్ టు వన్) సమావేశమవుతారు. యామాన్షి గ్రీన్ హైడ్రోజన్ ఎ÷-లాంటును సందర్శిస్తారు. అక్టోబర్ 2న తోషిబా, కవాసాకి, అక్టోబర్ 3న పానసోనిక్ ప్రధాన కార్యాలయాలను సందర్శిస్తారు, అక్టోబర్ 4న హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. ఈ పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ÷నాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ బలరాం నాయక్ తదితరులు వెళ్లారు.

# కాశ్మీర్‌లో మూడు కుటుంబాల పెత్తనం

- వారికి బుద్ధి చెప్పాల్సిన సమయమిదే
- ఎన్నికల ప్రచారంలో అమిత్ షా



**శ్రీనగర్:** జమ్మూలో మూడు కుటుంబాలు గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా కుటుంబం హింసను ప్రేరేపించాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తంచేశారు. కాబట్టి ఆ మూడు పార్టీల కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ వారసత్వ రాజకీయాలకు ముగింపు పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జమ్మూకశ్మీర్‌లోని మెంధార్‌లో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా ప్రతిపక్ష పార్టీలపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఎన్నికలు గాంధీ, ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా అనే మూడు కుటుంబాల పాలనను అంతం చేయబోతున్నాయని అమిత్ షా పేర్కొన్నారు. ఈ మూడు కుటుంబాలే ఎన్నోఏళ్లుగా జమ్మూలో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి రాకపోతే, జమ్మూకశ్మీర్‌లో ఎప్పటికీ పంచాయతీ లేదా బ్లాక్ స్థాయి ఎన్నికలు జరిగేవి కావని అన్నారు. 1990ల్లో ల్లో ఇక్కడి సోదరులు ధైర్యసాహసాలతో బు÷-లలెట్లను ఎదుర్కొన్నారు. 1947 నుంచి పాకిస్థాన్‌తో జరుగుతున్న ప్రతీ యుద్ధంలో సైనికులు జమ్మూ సరిహద్దుల్లో ఉంటూ దేశాన్ని రక్షిస్తున్నారని అమిత్‌షా సైనికుల త్యాగాలను కీర్తించారు. కేందప్రభుత్వం ఇప్పుడు కశ్మీర్ యువత చేతుల నుంచి తుపాకులు, రాళ్లను తీసేసి, పెన్నులు, ల్యాప్‌టాప్‌లు పట్టుకునేలా చేస్తోందని ప్రశంసించారు. త్వరలో ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలిస్తామని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం సరిహద్దుల్లో మరిన్ని బంకర్లను ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇక్కడి పాలకులు పాకిస్థాన్‌ను చూసి భయపడేవారు. కానీ ఇప్పుడు మోదీని చూసి పాకిస్థాన్ భయపడుతోంది. భారత్ పైకి వస్తే ప్రధాని తగిన సమాధానం ఇస్తారని వారికి తెలుసు. అందుకే దేశ సరిహద్దుల్లో కాల్పులు తగ్గుముఖం పట్టాయని షా అన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత మొదటిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. సెప్టెంబరు 18న తొలివిడత పోలింగ్ నిర్వహించగా.. రెండో దశ సెప్టెంబరు 25న, చివరిదశ అక్టోబర్ 1న జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలను అక్టోబర్ 8న వెల్లడిస్తారు. జమ్మూకశ్మీర్‌లో పర్యటించిన ప్రధాని మోదీ తొలివిడత ఎన్నికల్లో భారీగా ఓటింగ్ శాతం నమోదవడంపై హర్షం వ్యక్తంచేశారు. 'ఇప్పుడు జమ్మూకశ్మీర్ యువత నిస్సహాయులు కారు. ఆర్టికల్ 370 రద్దు చేసిన తర్వాత ఇక్కడ అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఇప్పుడు కశ్మీర్ యువత రాళ్లను వదిలి పుస్తకాలు, పెన్నులు పట్టుకుంటున్నారు. వారికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అంతేకాదు. ఇక్కడి ప్రజలు ఎలాంటి భయం, బెరుకు లేకుండా తమ ఓటుహక్కును వినియోగించుకుంటున్నారు. రెండో విడతలోనూ మరింత ఎక్కువమంది ఈ ప్రజాస్వామ్య పండుగలో పాల్గొని సరికొత్త రికార్డులు సృష్టించాలని మోదీ పిలుపునిచ్చారు.

# మూసీ ప్రక్షాళనలో మరో అడుగు

- నిర్వాసితులకు డబుల్ ఇళ్లు
- పిల్లిగుడిసల ప్రాంతాన్ని పరిశీలించిన పొన్నం



**హైదరాబాద్, ప్రజానావ:** మూసీ నది ప్రక్షాళనలో మరో ముందడుగు పడింది. ఆదివారం నుంచి మూసీ పరివాహక ప్రాంతాల్లోని ఆక్రమణలను తొలగించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. మొదటి విడతగా నదీగర్భంలోని ఆక్రమణలను తొలగించనున్నారు. ఈక్రమంలో పరివాహక ప్రాంతంలోని ప్రజలకు పునరావాసం కల్పించడంపై దృష్టి సారించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం పిల్లిగుడిసెలులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఈ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మూసీ పరివాహక ప్రాంత నివాసితులకు కేటాయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అక్కడ సుమారు 12 వేల ఆక్రమణలున్నట్లు గుర్తించారు. నది ప్రక్షాళనలో భాగంగా 55 కిలో మీటర్లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోంది. ఇక్కడి ఆక్రమణలను తొలగించేందుకు హైడ్రాకు బాధ్యతలు అప్పగించారు. మూసీని పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు సీఎం ప్రణాళికలు చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇదో మంచి ఉదాత్తమైన కార్యక్రమమని అన్నారు. ప్రజలంతా సహకరించాలన్నారు. నిర్వాసితులకు ఆవాసాలు కల్పిస్తామని అన్నారు. హైదరాబాద్ నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

# ఆలయ సంప్రోక్షణకు టిటిడి నిర్ణయం

**తిరుమల, ప్రజానావ:** కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరుడి మహా ప్రసాదమైన లడ్డూలో కల్తీ నెయ్యి వాడిన నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయాన్ని సంప్రోక్షణ చేయాలని ఇప్పటికే నిర్ణయించిన టీటీడీ ఆ క్రతువులో భాగంగా తొలుత మహా శాంతియాగాన్ని నిర్వహించాలని శనివారం నిర్ణయించింది. మూడు రోజులపాటు ఈ క్రతువు నిర్వహించ నున్నారు. సెప్టెంబర్ 23 నుంచి 25 వరకు శాంతియాగాన్ని జరపనున్నారు. వేదపండితులు, రుత్వికుల నడుమ శ్రీ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. తిరుమల శ్రీవారి వారి లడ్డూలో వాడకూడని పదార్థాలను వినియోగించిన నేపథ్యంలో లడ్డూలు తయారు చేసే పోటుతో పాటు, నెయ్యి భద్రపరిచిన ప్రదేశాలను సంప్రోక్షణ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తిరుమల సంప్రోక్షణకు సంబంధించిన విధివిధానాలు తెలియజేసేలా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం దృష్టి పెట్టింది.

# వార్త తెలియగానే తల్లడిల్లి పోయా

- నేరస్థులను కఠినంగా శిక్షించాల్సిందే
- చంద్రబాబును కోరిన నటుడు మోహన్‌బాబు



**హైదరాబాద్, ప్రజానావ:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుని కలుపుతున్నారని వార్తలు తెలియగానే ఒక భక్తుడిగా తల్లడిల్లిపోయానని సీనియర్ నటుడు మోహన్‌బాబు అన్నారు. ఆ స్వామి దగ్గర ఇలా జరగడం ఘోరం, పాపమని, ఇదేగాని నిజమైతే నేరస్థులను శిక్షించాలని ఏపీ సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. 'ప్రపంచ వ్యాప్తంగా ప్రతి హిందువు పూజించే కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి. ఆ దైవానికి నిత్యం సమర్పించే లడ్డూలలో కలిపే ఆవు నెయ్యిలో దాదాపు 3 నెలల క్రితం వరకు ఇతర జంతువుల కొవ్వుని కలుపు తున్నారని తెలియగానే ఒక భక్తుడిగా తల్లడిల్లిపోయాను. తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. నిత్యం 'మోహన్‌బాబు విశ్వవిద్యాలయం' నుంచి కనిపించే తిరుమల క్షేత్రాన్ని చూసి నాతో పాటు వేల మంది ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, భక్తిపూర్వకంగా నమస్కరించుకుంటూ ఉంటాం. ఆ స్వామి దగ్గర ఇలా జరగడం ఘోరం, పాపం, ఘోరాతి ఘోరం, నికృష్టం, అతినీచం, హేయం, అరాచకం. ఇదే నిజమైతే నేరస్థులను శిక్షించాలని నా ఆత్మీయుడు, నా మిత్రుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని హృదయపూర్వకంగా కోరుకుంటూ... ఈ కలియుగ దైవం శ్రీనివాసుని ఆశీస్సులు నా మిత్రుడు అందుకుని నూరేళ్ళు చల్లగా ఉండాలని కోరుకుంటున్నాను'ఇక మోహన్‌బాబు సినిమాల విషయానికొస్తే, తనయుడు మంచు విష్ణుతో కలిసి 'కన్నప్ప'లో నటిస్తున్నారు.

# గ్రీన్‌కార్డు హోల్డర్లకు శుభవార్త

**36 నెలలకు వ్యాలిడిటీ పొడిగింపు**

**వాషింగ్టన్:** అమెరికాలో శాశ్వత నివాసం పొందుతున్న గ్రీన్‌కార్డుదారులకు అక్కడి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ పర్మనెంట్ రెసిడెంట్ కార్డుల వ్యాలిడిటీ కాలాన్ని మరింత పొడిగించింది. గతంలో గ్రీన్‌కార్డు గడువు తీరినప్పటికీ .. మరో 24 నెలల పాటు దాని వ్యాలిడిటీ పొడిగించేవారు. ఇప్పుడు దీన్ని 36 నెలలకు పెంచినట్లు అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ వెల్లడించింది. దీంతో గ్రీన్‌కార్డు రెన్యువల్ కోసం ప్రయత్నిస్తున్న వారికి ఊరట లభించినట్లైంది. సాధారణంగా అమెరికాలో గ్రీన్‌కార్డులు పొందినవారు ప్రతీ పదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలి. ఇందుకోసం కార్డు గడువు తీరిపోయే కాలానికి ఆరు నెలల ముందే ఐ-90 ఫామ్‌ను సమర్పించాలి. రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్నవారికి కార్డు వ్యాలిడిటీని 24 నెలలు పొడిగిస్తూ రిసీట్ నోటీసు ఇస్తారు. దీంతో గ్రీన్‌కార్డు గడువు తీరిపోయినా.. ఈ నోటీసుతో వారికి చట్టబద్ధమైన నివాస హోదా కొనసాగుతుంది. కొత్త కార్డు జారీ అయ్యే వరకు ఉద్యోగాలు, ప్రయాణాల సమయంలో వారు దాన్ని లీగల్ స్టేటస్ ప్రూఫ్‌గా వినియోగించుకోవచ్చు. తాజాగా ఈ గ్రీన్‌కార్డు అదనపు వ్యాలిడిటీని 36 నెలలకు పెంచుతూ అమెరికా నిర్ణయం తీసుకుంది. దీంతో కొత్త కార్డుల కోసం వేచిచూసే వారు మరింతకాలం చట్టబద్ధంగా శాశ్వత నివాస హోదాను కొనసాగించేందుకు వీలు లభించినట్లవుతుంది. అయితే, కండిషనల్ రెసిడెన్సీ తీసుకునేవారి గ్రీన్‌కార్డుల గడువు రెండేళ్లపాటే ఉంటుంది. వీరికి తాజా పొడిగింపు వర్తించదు. వీరు ముందుగా నివాస హోదాపై ఉన్న కండిషన్స్ తొలగించుకునేందుకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కార్డు గడువు తీరే 90 రోజుల్లోపు దీన్ని చేసుకోవాలి. దరఖాస్తు అనుమతి పొందితే.. వారికి 10ఏళ్ల కాలానికి గ్రీన్‌కార్డు లభిస్తుంది.

# ఢిల్లీ సీఎంగా అతిషి ప్రమాణం



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా అతిషి శనివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో నిరాడంబరంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. దేశ రాజధానికి 8వ యువ ముఖ్యమంత్రి ఆమెనే కావడం విశేషం. అతిషితోపాటు కేబినెట్‌లో కొత్త ముఖాలకు చోటిచ్చారు. నూతన మంత్రులుగా సౌరభ్ భరద్వాజ్, కైలాష్ గహ్లోత్, గోపాల్ రాయ్, ఇమ్రాన్ హుస్సేన్, ముఖేష్ అహ్లావత్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోదియా, ఆప్ నేతలు హాజరయ్యారు. షీలాదీక్షిఆత్, సుష్మాస్వరాజ్ తరవాత అతిషి ఢిల్లీ మూడో ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు.

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..






హైదరాబాద్ గాంధీభవన్ లో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఘన నివాళులు అర్పించారు. కొండ లక్ష్మణ్ బాపూజీ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేశారని అన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ఆఫ్ హ్యాండ్లూం టెక్నాలజీ కి తెలంగాణ ప్రభుత్వం గౌరవప్రదంగా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టి, ఘన నివాళి అర్పించారని పేర్కొన్నారు.

# చదువుతో పాటు ఆటల్లో రాణించాలి





- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- ఎస్జీఎఫ్ మండల స్థాయి వాలీబాల్ పోటీల ప్రారంభోత్సవం
- వీర్నపల్లిలో పలు ప్రభుత్వ విద్యాలయాల ఆకస్మిక తనిఖీ

**వీర్నపల్లి, ప్రజానావ:** విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. వీర్నపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తరగతి గదులు, వంట గది, సామాగ్రి, స్కూల్ ఆవరణ పరిశీలించారు. అలాగే మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో భోజనం గది, కిచెన్, ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఈ రోజు మెనూలో ఏ ఆహార పదార్థాలు పెట్టారో అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ బిల్డింగ్ పైకి ఎక్కి చూశారు. బిల్డింగ్ పైకి ఎక్కి ద్వారానికి తాళం వేయాలని, అవసరం ఉన్న చోట గ్రిల్స్ పెట్టించాలని, విద్యాలయం ఆవరణ, వీధిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వీర్నపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ మండల స్థాయి వాలీబాల్ పోటీలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించి, వారితో సరదా గా కాసేపు వాలి బాల్ ఆడి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారు చదువుతోపాటు ఆటల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆటలు దేహదారుడ్యానికి, మనోవికాసానికి దోహదం చేస్తాయని వివరించారు. ఇక్కడ డీఈవో రమేష్ కుమార్, జిసిడిఓ పద్మజ, తహసిల్దార్ మారుతి రెడ్డి ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ ఫేర్ లో వేములవాడ శిశు మందిర్ విద్యార్థుల సత్తా



**వేములవాడ, ప్రజానావ:** కోరుట్ల శిశు మందిర్ కేంద్రంగా రెండు రోజులుగా నడుస్తున్న కరినగర్ విభాగ్ లెవెల్, నాలుగు జిల్లాల స్థాయి శిశు మందిర్ పాఠశాలల సైన్స్ ఫేర్ లో వేములవాడ శిశు మందిర్ విద్యార్థులు సత్తా చాటారు. చిరంజీవి మేరుగు ఆరాధన, కందుకూరి హసిని, చిట్ల చందనశ్రీ, మంచకట్ల శివరాజ్, మంతెన హర్షిత ప్రథమ స్థానంలో నిలవగా, చిరంజీవి చిలుక మనస్విని, రోహిణి, కీర్తన ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విజేతలు, సైన్స్ టీచర్లను పాఠశాల యాజమాన్యం అభినందించింది. గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో హైదరాబాద్ లో జరిగే సైన్స్ ఫేర్ లో పాల్గొంటారని పాఠశాల ప్రధానాచార్యులు చిలుక గట్టు తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

- గ్రేడ్ ఏ రకానికి రూ.2320
- కామన్ రకానికి రూ.2300
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

**సిరిసిల్ల, ప్రజానావ:** వరి ధాన్యం కొనుగోళ్ళు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్(2024-25) ధాన్యం కొనుగోళ్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో అదనపు కలెక్టర్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.హాకొనుగోలు కేంద్రాల్లో సకల వసతులు కల్పించాలని, తాగు నీరు, విద్యుత్ వసతి కల్పించాలని, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలని, నిర్దేశించిన విధంగా కొనుగోళ్లు చేయాలని స్పష్టం చేశారు. రైతులు తమ ధాన్యాన్ని తాలు, తప్ప లేకుండా, తేమ శాతం 17 ఉండేలా చూసుకుని కేంద్రాలకు తరలించాలని సూచించారు. అవసరమైన గన్ని బ్యాగులు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వంహాగ్రేడ్ ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2320,హాకామన్ రకానికి రూ. 2300 నిర్ణయించిదని వెల్లడించారు.

## ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం జిల్లా లో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వెల్లడించారు. ధాన్యాన్ని సేకరించేందుకు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202,హాఐకేపీ ఆధ్వర్యంలో 44, వివిధ శాఖల ఆధ్వర్యంలో 12 కేంద్రాలు, మొత్తం 258 ప్రారంభించనున్నట్లు తెలిపారు. అవసరం అయితే ఇంకా కేంద్రాలు ఎక్కువ ప్రారంభిస్తామని పేర్కొన్నారు,

## అందుబాటులో పరికరాలు

జిల్లాలో అవసరం మేరకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయని అదనపు కలెక్టర్ వెల్లడించారు. టార్పాలిన్లు 7777, తూకం వేసే యంత్రాలు 766, ప్యాడీ క్లీనర్లు 634, తేమ శాతం చూసే మెషిన్లు 603 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



సమీక్షలో డీసీఎస్ఓ వసంత లక్ష్మి, జిల్లా మేనేజర్ రజిత డీఏఓ అఫ్జల్ బేగం, డీసీఓ రామకృష్ణ, డీఎంఓ ప్రకాష్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, డీటీఓ లక్ష్మణ్,హాతదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**చందుర్తి, ప్రజానావ:** తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని చందుర్తి బ్యాంకు మేనేజర్ అనుజ జోషి అన్నారు. శనివారం మండలంలోని మరిగడ్డ గ్రామంలో లోన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అన్ని రకాల రుణాలు తీసుకోవచ్చని వాటిపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల తెలంగాణ గ్రామీణ బ్యాంకు హబ్ మనేజర్ ఐలేష్, ప్రాసెసింగ్ ఆఫీసర్ భూక్య మోహన్, స్థానిక బ్యాంక్ క్యాషియర్ సంతోష్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ రాహుల్, అకౌంటెంట్ నీత పాల్గొన్నారు.

# సీడీపీ పనుల స్థితిగతులపై నివేదిక అందించాలి

## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సిరిసిల్ల, ప్రజానావ:** సీడీపీ పనుల స్థితిగతులపై నివేదిక అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సీడీపీ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాజన్న సిరిసిల్ల జిల్లాలో నియోజకవర్గ అభివృద్ధి నిధుల పనులకు సంబంధించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ద్వారా 51 కోట్ల 85 లక్షలకు పైగా విలువ గల 1833 పనులు మంజూరు చేయడం జరిగిందని, వీటిని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, విద్యాశాఖ, మున్సిపల్ శాఖ మొదలగు 18 ఏజెన్సీలకు కేటాయించడం జరిగిందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పనులలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 16 కోట్ల 98 లక్షల పైగా ఖర్చు చేసి 738 పనులు పూర్తి చేశామని, 8 కోట్ల 46 లక్షలకు సంబంధించిన 300 పనులు పురోగతిలో ఉన్నాయని, 24 కోట్లు 21 లక్షలకు సంబంధించి 795 పనులు ఇంకా ప్రారంభం కాలేదని అన్నారు. క్షేత్రస్థాయిలో పనులు పూర్తయినప్పటికీ యూ.సీ. లు సమర్పించక పోవడం వల్ల ప్రభుత్వ రికార్డులలో పనులు పూర్తి కానట్లు ఉందని,నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తి చేసిన పనులకు సంబంధించి యూటిలైజేషన్ సర్టిఫికెట్లను విద్యాశాఖ అధికారి, ఏరియా ఆసుపత్రి అధికారి, సంబంధిత అధికారులు వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తుత స్థితిగతుల పట్ల సంబంధిత శాఖలు నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో సీపీఓ శ్రీనివాసాచారి, పీఆర్ ఈఈ భూమేష్, సెస్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ రమేష్ కుమార్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ జానకి, ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అనిత సింగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి నిర్మూలనకు కృషి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్
- జిల్లాస్థాయి నార్కో సమన్వయ సమావేశం

**సిరిసిల్ల, ప్రజానావ:** అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో గంజాయి నిర్మూలనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని శనివారం ఆయా శాఖల ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్. జిల్లావ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కలెక్టర్ ఆదేశాల మేరకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గంజాయి అక్రమ రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, వీటికి అలవాటు పడితే ఆర్థికంగా, ఆరోగ్య పరంగా, అనేక ఇబ్బందులు తప్పవని సూచించారు. డ్రగ్స్ వినియోగం దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు మీడియా, సోషల్ మీడియాతోపాటు డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ నిర్మూలనహాకోసం లైన్ డిపార్ట్మెంట్స్ ఒకటిగా కలిసి పని చేయాలని తెలిపారు. ప్రతి స్కూల్ ,కాలేజీలలో మత్తు పదార్థాల నిర్ములనకు కమిటీలను కొనసాగిస్తూ, విద్యార్థులు కు అన్ని రకాల మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించేందుకుహావ్యాసరచన, డిబేట్, పోటీలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి, డీఏఓ అఫ్జల్ బేగం, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.



ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం
22 సెప్టెంబర్ 2024


# ఈ ప్రభుత్వం.. మీ ప్రభుత్వం..



- భావితరాల బంగారు భవిష్యత్తు బాటలు వెయ్యాలి
- కుల, మత, వర్గ విభేదాలు లేకుండా జిల్లా అభివృద్ధికి తోడ్పడుదాం
- ఆదివాసుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క



**ఆదిలాబాద్/ఆసిఫాబాద్, ప్రజానావ:** 'ఈ ప్రభుత్వం.. మీ ప్రభుత్వం' అని రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శనివారం ఉట్నూర్ లోని కొమురంభీమ్ భవన సముదాయంలో గల ఆడిటోరియంలో ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు రాజర్షి షా, వెంకటేష్ ధోత్రే, ఐజీ, ఎస్పీలు గౌష్ ఆలం, డీవీ శ్రీనివాసరావు, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) తివారి, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మడి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, రాజ్ గోండ్ రాయి సెంటర్ జిల్లా అధ్యక్షుడు దుర్గుతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గోండ్వానా పంచాయతీ రాయి సెంటర్ల ప్రతినిధులు, సర్ మెడిలు, పటేళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదివాసి గిరిజనుల అభివృద్ధికి అనేక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. రాయి సెంటర్ అనేది రాయి సెంటర్ వ్యవస్థకు పునాది లాంటిదని, గ్రామస్థాయిలో తీసుకున్న నిర్ణయాలను రాయి సెంటర్ ద్వారా అమలు చేయడం జరుగుతుందని, ఈ రాయి సెంటర్ అభిప్రాయాలను ప్రాధాన్యతగా తీసుకొని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఆదివాసి ప్రాంతాలలోని సమస్యలను పరిష్కరించుకొని ప్రాంతాలను అభివృద్ధి చేసుకొని భావితరాలకు మంచి వ్యవస్థ అందించేందుకు తాతలు, అంతకు ముందు తరంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని గొప్ప నిర్ణయాలు తీసుకొని గొప్ప పథకాలు తెచ్చుకోవడం జరిగిందని తెలిపారు. ఈనాడు అమలవుతున్న చట్టాలు ఆనాటి పెద్దల అభిప్రాయాలు, పోరాటాలు, నిర్ణయాల ఫలితమేనని, ప్రస్తుతం మన ముందడుగు అందరి అభిప్రాయాల మేరకే చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగంతో కలిసి గోండ్వానా సమితి, రాజ్ గోండ్ రాయి సెంటర్ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, ఊరు వ్యవస్థ చిన్నాభిన్నం కాకుండా గిరిజన ఆచారాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లను కాపాడుకుంటూ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం అనేక సమస్యలను సమన్వయంతో పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. గతంలో జి. ఓ. నం.3 ప్రకారం ఆదివాసీలలో 7, 10 తరగతులు పూర్తి చేసిన వారికి ఉద్యోగాలు వచ్చాయని, రాష్ట్రంలోని ఆదివాసీలు, ఎస్. టి. లకు ఉట్నూరు లోని కొమురం భీం భవన సముదాయంలో తగు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఆదివాసి, గిరిజనుల అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై మీరు అందించే విలువైన అభిప్రాయాలను స్వీకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. తరతరాలుగా గిరిజన ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు అందరూ సమన్వయంతో ముందుకు సాగాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను పదవి చేపట్టిన తర్వాత వచ్చారని, జిల్లాలోని ప్రాజెక్టులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అమలుతో పాటు ఆదివాసి, గిరిజనుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఆదివాసీలకు అభివృద్ధికి మద్దతునిస్తూ సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటామని తెలిపారు. అన్ని ఆదివాసి సంఘాలతో నిర్వహించే సమావేశం కంటే ముందే గోండ్వానా సమితి, రాయి సెంటర్ ప్రతినిధులకు గౌరవం ఇస్తూ ముందుగా ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సమిష్టిగా కృషి చేస్తుందని, మన ఆత్మ గౌరవాన్ని కాపాడుకుంటూ భావితరాల భవిష్యత్తు బంగారు బాటలు వేయాలని, కుల, మత, వర్గ విభేదాలు లేకుండా జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

**బెజ్జుర్, ప్రజానావ:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి కు ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు తిరుపతి మాట్లాడుతూ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం మండల అధ్యక్షులు సామల తిరుపతి, ప్రధాన కార్యదర్శి కనికుట్ల వెంకటేష్, నాయకులు తెలంగాణ జావిద్, అవధూత సత్యనారాయణ, సామల వెంకటరమణ, పర్శ సంజీవ్, కనుకుట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐటీయూసీ పోరాట ఫలితంగా లాభాల వాటా చెల్లింపు

### ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్

**రెబ్బెన, ప్రజానావ:** ఏఐటీయూసీ పోరాటా ఫలితంగా కార్మికులకు లాభాల వాటా చెల్లింపు సాధించడం జరిగిందని ఏఐటీయూసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. శనివారం గోలేటిలో సింగరేణి కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్‌ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులకు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాట ఫలితంగానే కార్మికులకు 33శాతం లాభాల వాటా కాంట్రాక్టు కార్మికులకు చెల్లించడం జరుగుతుందని అన్నారు. కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించాలని 20 ఏండ్ల నుంచి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు, ఎన్నో త్యాగాలు చేశామని గుర్తు చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు భీమేష్ , చందు, ఇప్ప భీమయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## కేతిని గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



**కాగజ్‌నగర్, ప్రజానావ:** చింతలమానేపల్లి మండలంలోని కేతిని గ్రామంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలను సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 5వ తరగతి విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువులో బాగా రాణించాలని చెప్పారు. విద్యార్థులకు పండ్ల రసాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మాజీ జడ్పీటీసీ ఎల్ముల మల్లయ్య, మాజీ సర్పంచ్ నానయ్య, సుధాకర్, మాజీ ఎంపీపీలు మనోహర్ గౌడ్, శంకర్, తుకారాం, నానాజీ, ఏర్రయ్య, రంగన్న, కుకుడ్ కార్ రమేష్, పురుషోత్తం చారి, పవన్, కారు, మురళీ, మోహన్, సంజీవ్, భాస్కర్, రామయ్య సాయి, రేహన్, అతిక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





## స్వచ్ఛ కాగజ్‌నగర్‌కు తోడ్పడాలి

**కాగజ్ నగర్, ప్రజానావ:** స్వచ్ఛ కాగజ్‌నగర్‌కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తోడ్పడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం శంకర్ కోరారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ) ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్ర మంలో భాగంగా అవగాహన కల్పించి, మానవహారం చే పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల స్వచ్ఛందంగా భాగ్యస్వాములు అయినప్పుడే స్వచ్ఛ కాగజ్నగర్ సాధ్యమవుతుందన్నారు. తడి , పొడి, హానికర మైన చెత్తలు వాటిని వేర్వేరుగా చేయకపోతే, ఎన్నో నష్టాలు జరుగుతాయని సూచించారు. ప్లాస్టిక్ వాడకంతో ఎన్నో అనర్థాలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్‌ఇంజినీర్ ప్రణీల్ కుమార్, పునర్ణవ, సోషల్ ఫౌండేషన్ ప్రతినిధి బోర్లకుంట అశోక్, ప్రధాన ఉపాధ్యాయులు జాడే దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

## సికిల్ సెల్ బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజానావ, కాగజ్ నగర్ టౌన్ :** సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న చింతలమానేపల్లి మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన వగాడి దస్రు కొడుకు వగాడి చరణ్‌ను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించారు. చికిత్స కోసం తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మాజీ జడ్పీటీసీ మల్లయ్య, మురళీ, రావు, రమేష్, భాస్కర్, తిరుపతి, ఇన్నెశ్రావు, కృష్ణ, రామయ్య, దుబ్బుల మల్లయ్య, ఉమేష్ తదితరులు ఉన్నారు.

## కర్జల్లి-గూడెం బీటీ రోడ్డు రెన్యువల్ చేయిస్తాం

### సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్

**కాగజ్ నగర్, ప్రజానావ:** కర్జల్లి-గూడెం బీటీ రోడ్డును రెన్యువల్ చేయిస్తామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పేర్కొన్నారు. శనివారం చింతలమానపల్లి మండలంలోని గూడెం గ్రామస్తులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోయపల్లి, గూడెం, బూరుగూడ , శివపల్లి గ్రామస్తులు వారి గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, ప్రత్యేకించి కర్జెల్లి గూడెం మధ్య ఉన్న రహదారి బాగా పాడైందని, బీటీ రెన్యువల్ చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మాజీ జడ్పీటీసీ ఎల్ముల మల్లయ్య, మాజీ సర్పంచ్ నానయ్య, సుధాకర్, మాజీ ఎంపీపీలు మనోహర్ గౌడ్, శంకర్, తుకారాం, నానాజీ, ఏర్రయ్య, రంగన్న, కుకుడ్ కార్ రమేష్, పురుషోత్తం చారి, పవన్, కారు, మురళీ, మోహన్, దేశ్ ముఖ్ బద్రేశ్వర్, శ్రీనివాస్, ఎడిగం శంకర్, రామగిరి శంకర్, సంజీవ్, భాస్కర్, రామయ్య సాయి, రేహన్, అతిక్, జితేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





## దిందా వాగుపై హై లెవెల్ బ్రిడ్జికి అటవీ అనుమతులు సాధిస్తాం

### ఎమ్మెల్యే డాక్టర్‌పాల్వాయి హరీష్ బాబు

**కాగజ్ నగర్, ప్రజానావ:** దిందా వాగుపై హై లెవెల్‌బ్రిడ్జి నిర్మాణం కోసం అటవీ శాఖ నుంచి అనుమతులు సాధిస్తామని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు హామీ ఇచ్చారు. శనివారం చింతలమాలపల్లి మండలం దిందా గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అటవీ అనుమతుల జాప్యంతో దిందా వాగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం మొదలు కాలేదని, అటవీ అనుమతులు సాధించి దిందా వాగుపై బ్రిడ్జి నిర్మిస్తామని గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మాజీ జడ్పీటీసీ ఎల్ముల మల్లయ్య, మాజీ సర్పంచ్ నానయ్య, సుధాకర్, మాజీ ఎంపీపీలు మనోహర్ గౌడ్, శంకర్, తుకారాం, నానాజీ, ఏర్రయ్య, రంగన్న, కుకుడ్ కార్ రమేష్, పురుషోత్తం చారి, పవన్, కారు, మురళీ, మోహన్, సంజీవ్, భాస్కర్, రామయ్య సాయి, రేహన్, అతిక్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## కాగజ్‌నగర్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

**కాగజ్ నగర్, ప్రజానావ:** పట్టణంలోని పద్మశాలి భవనంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పట్టణ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడదాస్ మల్లయ్య , రాష్ట్ర నాయకులు, నల్ల కనకయ్య మాట్లాడుతూ పద్మశాలీలు సంఘటితంగా ఉండి, మన పద్మశాలీల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసేలా పద్మశాలి కుల బంధువులందరూ ఐక్యంగా ఉండి ఐక్యతను చాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు సిందం చేంద్రయ, గొల్లపల్లి నాగేశ్వరరావు, జగదీశ్వర్, పల్లె వెంకన్న, బండారి వెంకన్న, సురవర్ధన్, చేంద్రమొగిలే, అల్లి గురువయ్య, దుబ్బ సత్తన్న తదితరులు పాల్గొన్నారు.



## గుంతలను పూడ్చిన దరిగాం యూత్

**కాగజ్ నగర్, ప్రజానావ:** మండలంలోని దరిగాం గ్రామ రోడ్డుపై ఉన్న గుంతలను యువకులు శనివారం పూడ్చివేశారు. దాదాపు 3 కిలో మీటర్ల మేరకు ట్రాక్టర్లతో మొరం పోయించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ దరిగాం గ్రామానికి సరైన రహదారి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అడుగడుగునా గుంతలు ఏర్పడి నడవలేని పరిస్థితి ఉందని, బైకులు కూడా నడపలేని దుస్థితిలో రోడ్డు ఉందన్నారు. వర్షాకాలంలో రోగులు, వృద్ధులు, గర్భిణులను ఆసుపత్రికి తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో ఎవరిపైనా ఆశ పడకుండా తామే రోడ్డును బాగు చేసుకున్నామని యువకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, మల్లేష్, కుమార్, ప్రవీణ్, ప్రశాంత్, గణేష్, నవీన్, శేఖర్, చంటి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



### శాంతి ర్యాలీలు, సదస్సులు

## మార్గనిర్దేశనం కావాలి

- కరీంనగర్ పట్టణ ఏసీపీ గోపతి నరేందర్
- ఏసీపీ, సీఐలకు ముస్లింల ఆత్మీయ సన్మానం

**కరీంనగర్, ప్రజానావ:** వివిధ సందర్భాల్లో నిర్వహించే మిలాద్ ఉన్ నబీ, ఆధ్యాత్మిక సదస్సులు, శాంతి ర్యాలీలు ఆదర్శవంతమైన సమసమాజ నిర్మాణానికి మార్గ నిర్దేశకత్వం కావాలని, సామాన్య ప్రజలు అసహనానికి లోను కాకుండా, అసౌకర్యానికి గురి కాకుండా, మంచికి మార్గం వేసే విధంగా సంకేతాలు వెళ్లాలని కరీంనగర్ నగర ఏసీపీ గోపతి నరేందర్ అన్నారు. శనివారం సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కలిసి ఏసీపీ నరేందర్ కు, వన్ టౌన్ సిఐ బిల్లా కోటేశ్వర్, టూటౌన్ విజయ్ కుమార్, మహిళ టౌన్ శ్రీలత, వన్ టౌన్ ఎస్సై చంద్రశేఖర్ లకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో ఆత్మీయంగా సన్మానించారు. పోలీసు శాఖ ఇచ్చిన గడువు ప్రకారం, సరైన సమయానికి, పోలీసులు సూచనలు పాటిస్తూ, ఎలాంటి ఆటంకాలు లేకుండా మిలాదున్నబి జల్సా, నాత్, దరూద్ కి మహిఫిల్, ఖసీదా బుర్దా షరీఫ్ సదస్సులు నిర్వహించి ఆదర్శంగా నిలిచిన సున్నీ మర్కజీ మీలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రినీ, ఏసిపి నరేందర్ శాలువాతో ప్రతిగా సన్మానించారు. సమాజానికి మంచిని పంచే వారు, శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించే వాళ్లు ప్రభుత్వం దృష్టిలో, అధికారుల దృష్టిలో చిరస్థాయిగా గుర్తుండి పోతారని చెప్పారు. ఇలాంటి వారికి పోలీసు శాఖ ఎప్పుడూ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు మౌలానా ఖయ్యూం జియాయి, మౌలానా సలాహుద్దీన్ మిస్బాహి, సులేమాన్ మన్సూర్ తవక్కలి, యూసుఫోద్దీన్ ఖాద్రి రియాజ్, అబ్బాస్ హుస్సేన్, హబీబ్ ఖాద్రి, హాఫిజ్ ఖాజా బాబా, ఆయుబ్ ఖాన్, యూసుఫ్ బేగ్, సోహైల్ రజ్వి తదితరులు పాల్గొన్నారు.

# సామాన్య ప్రజలు సంతోషపడేలా పని చేయాలి

- రెవెన్యూ వ్యవస్థలో మార్పు రావాలి
- ప్రభుత్వ భూములను పరిరక్షించాలి
- ప్రతి గ్రామానికి రెవెన్యూ అధికారి
- రెవెన్యూ సంఘాల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**ఖైరతాబాద్, ప్రజానావ:** ప్రజాపాలనలో ప్రజలు కేంద్ర బిందువుగా తమ ప్రభుత్వ నిర్ణయాలు, ఆలోచనలు ఉంటాయని వాటిని దృష్టిలో పెట్టుకుని సామాన్య ప్రజలు సంతోషపడేలా రెవెన్యూ శాఖలోని అధికారులు, సిబ్బంది సమిష్టిగా చిత్తశుద్ధితో పని చేయాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రెవెన్యూ శాఖలోని ఐదు సంఘాలతో శనివారం నాడు సచివాలయంలో మంత్రిగారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'మీ పని తీరు మరింత మెరుగు పడాలి. గతంలో పని చేసిన విధానం వేరు, ఇప్పుడు వేరు. ఏమైనా ఉంటే పాత వాసనలు పక్కకు పెట్టండి. నిజాయితీ, నిబద్ధతతో పారదర్శకంగా పనిచేయండి.రెవెన్యూ యంత్రాంగం పాజిటివ్ దృక్పథంతో పని చేస్తూ ప్రజల్లో ఒక నమ్మకాన్ని కల్పించాలి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి. మాది ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం. ఎవరిమీద వ్యక్తిగత కోపాలు లేవు. మా తపన అంతా ఈ పేద ప్రజానీకానికి మేలు చేయాలన్నదే. రాబోయే రోజుల్లో రెవెన్యూ వ్యవస్థలో స్పష్టమైన మార్పు కనిపించాలి. ప్రభుత్వానికి రావలసిన ప్రతి రూపాయి రావాల్సిందే, ప్రతి అంగుళం రావాల్సిందే, గజం భూమి కూడా కబ్జాకు గురి కావొద్దు. ప్రభుత్వ భూములను కాపాడే విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా న్యాయపరంగా గట్టిగా వ్యవహరించాలి. ఈ విషయంలో సరైన సూచనలు, సలహాలు ఇవ్వడానికి వీలుగా సచివాలయంలోని రెవెన్యూ ముఖ్య కార్యదర్శి కార్యాలయంలో ప్రత్యేకంగా లీగల్ సెల్‌ను ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం తగిన ప్రత్యామ్నాయాలు సూచించకుండా వీఆర్ఓ, వీఏఓ వ్యవస్థను రద్దు చేయడం వల్ల, గ్రామీణ ప్రాంతాలలో రెవెన్యూ వ్యవస్థ లేకుండా పోయిందని, ప్రతి గ్రామానికి ఒక రెవెన్యూ అధికారి ఉండేలా రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తాం' అని స్పష్టం చేశారు.

### రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి

రెవెన్యూ శాఖకు సంబంధించిన ఉద్యోగుల సంఘాలతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ వివిధ స్థాయిల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. ఆయా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈనెల 29న రాష్ట్రంలోని 900 మంది తహశీల్దార్లతోను, అక్టోబరు 6న డిప్యూటీ కలెక్టర్స్, అదనపు కలెక్టర్లు 250 మందితో ప్రత్యేకంగా భేటీ కానున్నట్లుగా మంత్రి తెలిపారు. అన్ని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాక, తెలంగాణ వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు గరికె ఉపేందర్ రావు, తెలంగాణ రాష్ట్ర వీఆర్ఏ హక్కుల సాధన సమితి చైర్మన్ ఆర్.విజయ్, కన్వీనర్ కె.సత్యనారాయణ, తెలంగాణ రీడిప్లాయిడ్ వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రెవెన్యూ టెక్నికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రఘు, ఎం.భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### అధికారుల విజ్ఞప్తులివే..

- ఎన్నికల ప్రక్రియలో భాగంగా వేరే ప్రాంతాలకు బదిలీ అయిన తహశీల్దార్లను, 317 జీవో ద్వారా బది లీ అయిన తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులను తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలి.
- జీవో.80 ఫైనాన్స్(హెచ్ఆర్ఎం-1) నుంచి వీరి కి మినహాయింపు కల్పించాలి.
- రెవెన్యూ శాఖ నుంచి ఇతర శాఖలకు సర్దుబాటు చేసిన వీఆర్వోలు, వీఆర్ఏలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకురావాలి.
- అన్ని స్థాయిల్లో రెవెన్యూ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి.
- సీసీఎల్ఏ సహా అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేసి, ఉద్యోగులపై పనిభారం తగ్గించాలి.
- తహశీల్దార్ల అద్దె వాహనాల బిల్లులు 15 రోజుల్లో వచ్చేలా చూడాలి. అద్దె వాహనాలకు చెల్లించే మొత్తాన్ని నెలకు రూ.33వేల నుంచి రూ.50వేలకు పెంచాలి.
- ఎన్నికల వ్యయం సహా ఇతర అన్ని బిల్లులు త్వరగా మంజూరయ్యేలా చూడాలి.
- చిన్న చిన్న సమస్యలకు తహశీల్దార్లు/ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్లపై కేసులు నమోదు చేయకుండా పోలీసు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలి.
- పదోన్నతులపై ఇతర జిల్లాల్లో జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న వారిని తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలి.
- కొత్త ఆర్వోఆర్ చట్టం అమలు, ఇప్పుడున్న చట్టాల అమలు కోసం రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక శిక్షణ సంస్థను ఏర్పాటు చేయాలి.
- అద్దె కార్యాలయాల స్థానంలో మండల, డివిజనల్ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించాలి.
- ప్రతి గ్రామానికి ఒక జూనియర్ రెవెన్యూ అధికారి ఉండాలి.
- వీఆర్వో, వీఆర్ఏల కారుణ్య నియామకాలు చేపట్టాలి.
- వీఆర్వోలకు సర్వీస్ ప్రొటెక్షన్, పే ప్రొటెక్షన్ కల్పించాలి. కామన్ సీనియార్టీ ద్వారా పదోన్నతులు కల్పించాలి.
- జీవో 81 ప్రకారం తక్కువ సమయంలో ఎలాంటి బెనిఫిట్స్ పొందకుండా పదవీ విరమణ చేస్తున్న 55 ఏళ్ల నుంచి 61 ఏళ్ల వయస్సు గల వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇచ్చి 2500 దళిత కుటుంబాలను ఆదుకోవాలి.
- టెక్నికల్ మేనేజర్లు(హెచ్చెచ్పీలు), టైపిస్ట్ కమ్ కంప్యూటర్ అపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- ఏజెన్సీ వ్యవస్థను తొలగించాలి. సీనియారిటీ ప్రకారం జీతభత్యాలు చెల్లించాలి. ఈహెచ్ఎస్ అమలు చేయాలి.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం
22 సెప్టెంబర్ 2024




# శతక్కొట్టిన పంత్, గిల్..

## విజయానికి ఆరు వికెట్ల దూరంలో భారత్

**చెన్నై:** బంగ్లాదేశ్‌తో చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసింది. బంగ్లాదేశ్‌కు భారత్ 515 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 37.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 158 పరుగులు చేసింది. వెలుతురు సరిగా లేకపోవడంతో 9 ఓవర్లు ఉండగానే ఆటను నిలిపేశారు. క్రీజులో కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో (51బి) అర్ధ సెంచరీతో పోరాడుతున్నాడు. మరో ఎండ్‌లో షకీబ్ అల్ హసన్ (5బి) ఉన్నారు. బంగ్లాదేశ్ గెలవాలంటే 357 పరుగులు చేయాలి. కానీ వారి చేతిలో ఇంకా 6 వికెట్లు మాత్రమే ఉన్నాయి. ఈ 6 వికెట్లు భారత్ బౌలర్లు పడగొడితే భారత్‌కు గెలుపు వరిస్తుంది. మూడో రోజు భారత్ తన రెండో ఇన్నింగ్స్‌ను 287/4 వద్ద డిక్లేర్ చేసింది. అంతకుముందు టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులు మాత్రమే చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 227 పరుగుల వెనుకంజలో ఉన్న బంగ్లాదేశ్‌కు 515 పరుగుల టార్గెట్ నిలిచింది. కాగా.. రెండో ఇన్నింగ్స్‌లో 515 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్.. కీలక 4 వికెట్లు పోగొట్టుకుంది. జాకీర్ హాసన్ (33), షాద్ మన్ ఇస్లాం (35), మోహినుల్ హక్ (13), ముష్ఫికర్ రహీం (13) పరుగులు చేసి ఔటయ్యారు. భారత్ బౌలర్లలో 3 వికెట్లతో చెలరేగాడు. మరో వికెట్ బుమ్రాకు దక్కింది.



### అరె భాయ్ లెగ్ సైడ్ ఫీల్డర్ లేడు..
## ఇటు వైపు ఒకరిని పెట్టు

భారత జట్టు వికెట్ కీపర్ రిషభ్ పంత్ టెస్టుల్లో తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. తొలి ఇన్నింగ్స్‌లో విఫలైమన పంత్.. చెపాక్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీతో విజృంభించాడు. ఒంటిచేతి విన్యాసాలతో అలరించిన పంత్ టీమిండియాను పటిష్ఠ స్థితిలో నిలిపాడు. అంతేకాదండోయ్.. 2019లో మహేంద్ర సింగ్ ధోనీ మాదిరిగానే అతడూ కాసేపు బంగ్లాదేశ్ కెప్టెన్ తానే అన్నట్టుగా ప్రవర్తించాడు. అవును.. మ్యాచ్ మధ్యలో పంత్ ఫీల్డింగ్ సెట్ చేసిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. మైదానంలో కుదురుగా ఉండడం అంటే పంత్‌కు నచ్చదు. బ్యాటింగ్, వికెట్ కీపింగ్ ఏదైనా సరే తెగ ఆస్వాదిస్తాడు. చెపాక్ టెస్టులో మూడో రోజు పంత్ ఏకంగా బంగ్లాదేశ్ జట్టు ఫీల్డింగ్ సెట్ చేశాడు. 23 పరుగుల వద్ద ఉన్న పంత్.. ప్రత్యర్థి కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో వైపు చూస్తూ.. 'ఇక్కడ చూడు. లెగ్ సైడ్ ఓ ఫీల్డర్ తగ్గాడు' అని కేక వేశాడు. అంతే.. శాంటో వెంటనే ఓ ఫీల్డర్‌ను అక్కడికి పంపాడు. ఆ తర్వాత పంత్ మళ్లీ యథావిధిగా బ్యాటింగ్ కొనసాగించి చిరస్మరణీయ శతకం బాదాడు. ఆరో శతకంతో ధోనీ రికార్డును సైతం పంత్ సమం చేశాడు.శుభ్‌మన్ గిల్(119 నాటౌట్)తో కలిసి రికార్డు భాగస్వామ్యంతో టీమిండియాను పటిష్ఠ స్థితిలో నిలిపాడు.

### దిగ్గజాల సరసన చేరిన యువ ఆటగాడు గిల్ సెంచరీ

బంగ్లాదేశ్‌తో జరిగిన చెన్నై టెస్టులో టీమిండియా యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ టెస్టుల్లో 5వ సెంచరీ సాధించాడు. 119 పరుగులతో అజేయంగా ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్‌లో గిల్ 10 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సిక్సర్ల మార్కును కూడా దాటేశాడు. మరోవైపు.. గిల్ శతకం బాదడంతో బంగ్లాదేశ్‌కు 515 పరుగుల విజయలక్ష్యాన్ని భారత్ నిర్దేశించింది. గిల్‌కు రిషబ్ పంత్ తోడవ్వడంతో టీమిండియా భారీ స్కోరు చేసింది. ఒకానొక సమయంలో భారత్ స్కోరు 67 వద్ద మూడు వికెట్లు కోల్పోగా.. గిల్, పంత్ నాలుగో వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. టెస్టు క్రికెట్‌లో శుభ్‌మన్ గిల్‌కి ఇది బ్యాక్ టు బ్యాక్ సెంచరీ. అంతకుముందు ఇంగ్లండ్‌తో సిరీస్‌లో చివరి టెస్టులో సెంచరీ సాధించాడు. 2024లో శుభ్‌మన్ గిల్‌కి ఇది మూడో టెస్టు సెంచరీ. ఈ ఏడాది క్రికెట్‌లో సుదీర్ఘమైన ఫార్మాట్‌లో భారత్ తరఫున అత్యధిక సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ ఈ ఏడాది చెరో 2 టెస్టు సెంచరీలు చేశారు.

## బంగ్లాకు ఫాలో ఆన్ ఎందుకివ్వలేదు?

చెన్నై: చెపాక్ వేదికగా బంగ్లాదేశ్ తో జరుగుతున్న తొలి టెస్ట్ లో టీమిండియా ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇటు బ్యాట్ తో అటు బాల్ తో రాణిస్తూ.. ప్రత్యర్థికి చుక్కలు చూపిస్తోంది. ఇక ఫస్ట్ ఇన్నింగ్స్ లో 376 పరుగులకు భారత్ ఆలౌట్ కాగా.. బంగ్లాదేశ్ ను తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 149 పరుగులకే పరిమితం చేసింది. దాంతో టీమిండియాకు 227 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. అయితే ఇంత లీడ్ ఉన్నప్పటికీ.. బంగ్లాను ఫాలో ఆన్ ఆడించలేదు. ఇప్పుడు ఇదే ప్రశ్న సగటు క్రికెట్ ఫ్యాన్స్ లో మెదులుతోంది. బంగ్లాను టీమిండియా ఫాలో ఆన్ ఆడించకపోవడానికి రెండు కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ వివరాల్లోకి వెళితే.. బంగ్లాతో జరుగుతున్న తొలి టెస్ట్ లో టీమిండియాకు తొలి ఇన్నింగ్స్ లో 227 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. సాధారణంగా ఇంత లీడ్ ఉన్నప్పుడు ఏ టీమ్ అయినా.. ప్రత్యర్థిని ఫాలో ఆన్ ఆడిస్తుంది. కానీ.. ఇక్కడ కెప్టెన్ రోహిత్ శర్మ అలా చేయలేదు. బంగ్లాను 149 పరుగులకు ఆలౌట్ చేసిన తర్వాత టీమిండియా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. అయితే ఇలా ఎందుకు చేసింది? ఫాలో ఆన్ ఆడించాల్సిందిగా? అని క్రికెట్ ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ ఇలా చేయకపోవడానికి రెండు కారణాలు ఉన్నట్లుగా తెలుస్తోంది. అందులో మొదటిది ఇటీవలే ముగిసిన పాక్-బంగ్లా తొలి టెస్ట్. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 448/7 పరుగుల వద్ద ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసింది. ఆ తర్వాత బంగ్లా అనూహ్యంగా చెలరేగి 565 పరుగుల భారీ స్కోర్ చేసింది. దాంతో బంగ్లాదేశ్ కు 117 పరుగుల కీలక ఆధిక్యం లభించింది. ఆ తర్వాత పాక్ ను సెకండ్ ఇన్నింగ్స్ లో తక్కువ రన్స్ కే కట్టడి చేసి.. ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయకూడదని రోహిత్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇక సెకండ్ రీజన్ కు వస్తే.. టీమిండియా బౌలర్లకు విశ్రాంతిని ఇవ్వాలని బంగ్లాను ఫాలో ఆన్ ఆడించలేదు.



## రికార్డులను బ్రేక్ ఆఫ్ఘనిస్తాన్

### దక్షిణాఫ్రికాపై సిరీస్ విజయం

**షార్జా:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని షార్జాలోని షార్జా క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో ఆఫ్ఘనిస్తాన్ 177 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంలో ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్లు రహ్మానుల్లా గుర్బాజ్, రషీద్ ఖాన్ ప్రధాన పాత్రలు పోషించారు. దింతో ఆఫ్ఘనిస్తాన్ తమ సిరీస్ విజయాన్ని నమోదు చేసింది. రెండో వన్డేలో 177 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0 ఆధిక్యం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ 50 ఓవర్లలో 311/4 భారీ స్కోరు చేసింది. ఇక లక్ష్య ఛేదనలో ప్రోటీస్ 34.2 ఓవర్లలో కేవలం 134 పరుగులకే ఆలౌట్ అయింది. దింతో ఆఫ్ఘనిస్తాన్ వన్డేలలో పరుగుల పరంగా వారి అతిపెద్ద విజయాన్ని అందుకున్నారు. అంతకుముందు దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో కూడా ఆఫ్ఘనిస్థాన్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నాలుగవ సిరీస్‌ను గెలుచుకోవడంలో ఆఫ్ఘనిస్తాన్ విజయం సాధించింది. అంతకుముందు బంగ్లాదేశ్, జింబాబ్వే, ఐర్లాండ్‌లపై వన్డే సిరీస్‌లను గెలుచుకుంది. షార్జా మైదానంలో జరిగిన సిరీస్‌లో రెండో వన్డే మ్యాచ్‌లో రహ్మానుల్లా గుర్బాజ్ బ్యాట్‌తో ఆఫ్ఘనిస్థాన్ జట్టుకు విజయాన్ని అందించగా, రషీద్ ఖాన్ బంతితో అద్భుతంగా బౌలింగ్ చేసాడు. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 311 పరుగులు చేసింది. ఇందులో రహ్మానుల్లా గుర్బాజ్ ఇన్నింగ్స్ 105 పరుగులు, ఒమర్జాయ్ అజేయంగా 86 పరుగులు, రహ్మత్ షా 50 పరుగులు చేసారు. దీనికి సమాధానంగా దక్షిణాఫ్రికా జట్టు 34.2 ఓవర్లలో 134 పరుగులకే పరిమితమై 177 పరుగుల భారీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. వన్డే చరిత్రలో పరుగుల తేడాతో ఆఫ్ఘనిస్థాన్‌కు ఇదే అతిపెద్ద విజయం.



## అటాకింగ్‌లో నాకంటే పంత్ బెస్ట్

### ఆసీస్ దిగ్గజం గిల్‌క్రిస్ట్ కితాబు



**చెన్నై:** ప్రపంచంలోని అత్యుత్యమ ఓపెనర్లలో ఆడం గిల్‌క్రిస్ట్ పేరు ముందు వరుసలో ఉంటుంది. తన అటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థి బౌలర్ల వెన్నులో వణుకు పుట్టించడం అతడికి మహా సరదా. ఆస్ట్రేలియా తరఫున వికెట్ కీపర్, ఓపెనర్.. రెండు పాత్రల్ని అమోఘంగా పోషించిన గిల్లీ సుదీర్ఘ కెరీర్‌లో అత్యున్నత శిఖరాలకు చేరాడు. ఇప్పుడు కామెంటేటర్‌గా సైతం రాణిస్తున్న ఈ ఆసీస్ దిగ్గజం భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్‌పై ప్రశంసలు కురిపించాడు. చెపాక్‌లో పంత్ సెంచరీతో గర్జించిన తీరును గిల్‌క్రిస్ట్ అద్భుతమని వర్ణించాడు. అంతేకాదు అటాకింగ్ గేమ్ ఆడడంలో తనకంటే పంత్ రెండాకులు ఎక్కువే చదవాడని గిల్లీ కితాబిచ్చాడు. 'అవును.. బౌలర్లను ఉతికారేయడంలో పంత్ నా కంటే కొంచెం ముందున్నాడు. నా మాదిరిగా కాకుండా అప్పుడప్పుడే ముందుకొచ్చి షాట్లు ఆడుతాడు. అలా పంత్ ఒత్తిడిని చిత్తు చేస్తాడు. నేను చాలా దూకుడుగా ఆడాను. కానీ, పంత్ మాత్రం ఇసుమంత భయం కూడా లేకుండా చెలరేగిపోతున్నాడు. అతడొక క్లాస్ ప్లేయర్' అని గిల్‌క్రిస్ట్ వెల్లడించాడు. రెండేండ్ల క్రితం కారు యాక్సిడెంట్ నుంచి కోలుకున్న పంత్ ఏడాదిన్నర తర్వాత పునరాగమనం చేశాడు. ఐపీఎల్‌లో హాఫ్ సెంచరీలతో ఫామ్ అందుకున్న అతడు.. టీ20 వరల్డ్ కప్ లో చేసింది కొన్ని పరుగులే అయినా అటాకింగ్ గేమ్‌తో ఆకట్టుకున్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత టెస్టుల్లో ఆడిన ఈ డాషింగ్ బ్యాటర్ చెపాక్‌లో శతకంతో చెలరేగాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఒంటిచేత్తో సిక్సర్లు బాదుతూ మునపటి పంత్‌ను తలపించాడు. టాపార్డర్ విఫలమైనా నేనున్నాను బాస్ అంటూ శుభ్‌మన్ గిల్(119 నాటౌట్)తో కలిసి బంగ్లా బౌలర్లను ఉతికి ఆరేశాడు. వీళ్లిద్దరూ నాలుగో వికెట్‌కు 167 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పాడు. 109 పరుగుల వద్ద పంత్ ఔటైన కాసేపటికే కెప్టెన్ రోహిత్ శర్మ టీమిండియా 287/4 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేశాడు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
సినిమా CINEMA
10
శనివారం
21 సెప్టెంబర్ 2024

# దేవర స్పెషల్ షోలకు అనుమతి

## ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఎన్టీఆర్




ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'జాన్వీకపూర్ కథానాయిక కాగా సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషించారు. ఈ నెల 27న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలోనే ఎన్టీఆర్ అభిమానులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రత్యేక షోలకు అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది.టికెట్ ధరలు, స్పెషల్ షోల విషయంపై ఇటీవల 'దేవర' టీమ్ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సంప్రదించింది. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూ తాజాగా జీవో విడుదల చేసింది. ఈమేరకు తొలిరోజు అర్ధరాత్రి 12 గంటల షోతో పాటు ఆరు ఆటలకు అనుమతిచ్చింది. 28వ తేదీ నుంచి ఐదు ఆటలకు పర్మిషన్ ఇచ్చింది. అలాగే టికెట్ ధరలను సైతం పెంచుకోవడానికి వెసులుబాటు కల్పించింది. సింగిల్ స్క్రీన్స్‌లో జీఎస్టీతో కలిసి అప్పర్ క్లాస్ రూ.110, లోవర్ క్లాస్ రూ.60, మల్టీప్లెక్స్ థియేటర్స్‌లో రూ.135 వరకూ పెంచుకునేందుకు అవకాశం కల్పించింది. మరోవైపు తెలంగాణలోనూ స్పెషల్ షోలకు ప్రభుత్వం ఓకే చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. తొలిరోజు అర్ధరాత్రి 1 గంట షోకు అనుమతివ్వడంతో పాటు, రోజూ ఆరు ఆటలను 14 రోజుల పాటు ప్రదర్శించేందుకు అంగీకరించారట. సింగిల్ స్క్రీన్ థియేటర్స్‌లో రూ.50, మల్టీప్లెక్స్‌ల్లో రూ.100 పెంచుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. స్పెషల్ షోలకు అనుమతించడంతో సీఎం చంద్రబాబునాయుడు.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కి నటుడు ఎన్టీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తెలుగు సినిమాకు సహకారం అందిస్తున్న మీకు కృతజ్ఞతలు. సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేశ్‌గారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా' అంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

# నటీమణులు ధైర్యంగా ఉండాలి

## నటి ఐశ్వర్య రాజేశ్



జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ వైరల్‌గా మారిన తరుణంలో చిత్ర పరిశ్రమలో వేధింపులపై నటి ఐశ్వర్య రాజేశ్ స్పందించారు. నటీమణులు ధైర్యంగా ఉండాలని తాజాగా ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. నేను చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి దాదాపు 12 ఏళ్లు అవుతోంది. కాలానుగుణంగా ఎన్నో మార్పులు జరిగాయి. చిత్ర పరిశ్రమలో నేను ఎలాంటి వేధింపులు ఎదుర్కోలేదు. వేధింపులకు పాల్పడిన దోషులకు సరైన శిక్ష పడాలి. చిత్ర పరిశ్రమకు సంబంధించి మహిళలకు నేను ఇచ్చే సలహా ఒక్కటే. మీరు ధైర్యంగా ఉండండి. చొరవ తీసుకోవాలని ఎవరైనా ప్రయత్నిస్తే వెంటనే స్పందించండి. గట్టిగా మీ స్వరాన్ని వినిపించండని తెలిపారు. అవుట్‌డోర్ షూట్స్‌కు వెళ్లినప్పుడు సరైన వసతుల్లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని.. టాయిలెట్స్ కూడా సరిగ్గా ఉండటం లేదని ఆమె వ్యాఖ్యలు చేశారు. దాదాపు ఏడేళ్లపాటు శ్రమించి జస్టిస్ హేమ కమిటీ ఓ నివేదికను సిద్ధం చేసింది. మలయాళ సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వర్కింగ్ కండీషన్లు, రెమ్యూనరేషన్, సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలను అధ్యయనం చేసిన కమిటీ.. కాస్టింగ్ కౌచ్ మొదలు వివక్ష వరకు మాలీవుడ్‌లో మహిళలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ఇదేతరహా కమిటీని అన్ని చిత్ర పరిశ్రమల్లో ఏర్పాటుచేయాలని నటీనటులు కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనే నటి రోహిణి అధ్యక్షతన కోలీవుడ్‌లో ఓ కమిటీ ఏర్పాటు అయింది. వేధింపులు ఎదురయ్యాయని ఎవరైనా తమ వద్దకువస్తే.. ఆ ఫిర్యాదును సైబర్ పోలీస్ విభాగానికి అందజేస్తామని రోహిణి తెలిపారు. దోషిగా తేలినవారిని దాదాపు ఐదేళ్లు కోలీవుడ్ నుంచి బ్యాన్ చేస్తామని అన్నారు.



## రొమాంటిక్ కామెడీ మూవీగా

# రాజాసాబ్

## చిత్ర విశేషాలు పంచుకున్న మాళవిక

వరుస విజయాలతో జోష్ మీదున్న ప్రభాస్ ప్రస్తుతం 'రాజాసాబ్'తో బిజీగా ఉన్నారు. మారుతి దర్శకత్వంలో సిద్ధమవుతోన్న ఈ చిత్రం రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కుతోంది. ఇందులో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమారి తదితరులు ఆడి పాడనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి మాళవిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తన తాజా చిత్రం 'యుధ్రా' ప్రచారంలో పాల్గొన్న ఆమె 'రాజాసాబ్' షూటింగ్‌పై ఓ అప్‌డేట్ ఇచ్చారు. రాజాసాబ్ రొమాంటిక్ కామెడీగా రానుంది. నేను ఈ చిత్రంతో తెలుగు పరిశ్రమలో అడుగుపెట్టబోతున్నందుకు ఆనందంగా ఉంది. ఇప్పటివరకు సరైన స్క్రిప్ట్ కోసం ఎదురుచూశాను. ఇందులో నా పాత్రకు ప్రాధాన్యం ఉంది. ఇలాంటి సినిమాలో అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా ఇది మంస్తాబవుతోంది. ప్రస్తుతం సగం షూటింగ్ పూర్తయింది. ప్రభాస్ ఇంటి భోజనానికి ఎవరైనా ఫిదా కావాల్సిందే. భోజనమంటే ఏదో ఒక కర్రీ, బిర్యానీ తెప్పించడం కాదు.. ఏకంగా పెద్దపెద్ద పాత్రల్లో ఒక గ్రామానికి సరిపోయేంత ఆహారాన్ని ఏర్పాటుచేస్తాడు. ఇప్పటివరకు నేను అలాంటి రుచికరమైన ఆహారాన్ని తినలేదు అంటూ ప్రభాస్‌పై మాళవిక ప్రశంసలు కురిపించారు. 'రాజాసాబ్' విషయానికొస్తే.. యూవీ క్రియేషన్స్ పతాకంపై ఇది రానుంది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో హారర్ ఎలిమెంట్స్‌తో తీర్చిదిద్దుతున్నట్లు టాక్. ఇప్పటివరకూ ప్రభాస్ చేయని సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. అంతేకాదు, మూవీ విజువల్ వండర్‌లా ఉంటుందని నిర్మాత ఓ సందర్భంలో తెలిపారు. 'బాహుబలి' తర్వాత భారీ బ్జడెట్ చిత్రాల్లో కనిపించిన ప్రభాస్ పాత్ర ఇందులో రిఫ్రెషింగ్ ఉంటుందని, అభిమానులను ఎంటర్‌టైన్ చేస్తుందని ఆయన అన్నారు. ఈ సినిమా వచ్చే ఏప్రిల్ 10న విడుదల కానున్న విషయం తెలిసిందే.




## ఆది హీరోగా సస్పెన్స్ థ్రిల్లర్ 'షణ్ముఖ'

తెలుగులో మంచి కంటెంట్‌తో వచ్చిన డివోషనల్ థ్రిల్లర్‌కు మంచి ఆదరణ వుంటుందన్న విషయం తెలిసిందే. అయితే తెలుగులోనే కాకుండా ఆసక్తిని కలిగించే నేపథ్యంతో రూపొందే డివోషనల్ చిత్రాలకు అన్ని భాషల్లో మంచి ఆదరణ వుంటుంది. ఇప్పుడు ఆ జాబితాలో చేరడానికి రెడీ అవుతున్న మరో పాన్ ఇండియా సూపర్ డివోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయిక గా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణా నంతర పనులను శరవేగంగా జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించి ఓ పోస్టర్‌ను విడు దల చేశారు మేకర్స్. ఈ పోస్టర్ అందరిలోనూ ఉత్కంఠను ఆసక్తిని రేపుతుంది. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా ఆది నటిస్తున్న విషయం తెలిసిందే. పోస్టర్ చూసిన అందరిలోనూ పాజిటివ్ వైబ్ కనిపిస్తుంది.ఈ సందర్భంగా దర్శకుడు మట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఓ అద్భుతమైన పాయింట్‌తో రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ ఇది. విజువల్ వండర్‌లా, అద్భుతమైన గ్రాఫిక్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. డివోషనల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ప్రతి పాత్ర హైలైట్‌గా వుంటుంది. ఈ దీపావళి సీజన్‌లో ఫ్యామిలీ చూడదగ్గ డివోషనల్ థ్రిల్లర్ ఇది. కేజీఎఫ్, సలార్ చిత్రాలకు తన సంగీతంతో ప్రాణం పోసిన రవి బసూర్ ఈ చిత్రానికి స్టనింగ్ మ్యూజిక్‌ను అందిస్తున్నారు. ప్రస్తుతం అత్యున్నత సాంకేతిక నిపుణులతో నిర్మాణనంతర పనులు మొదలుకానున్నాయి. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఓ వండర్‌ఫుల్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకరావడానికి ప్రయత్నిస్తున్నాం. తప్పకుండా ఈ చిత్రం ఆది కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోతుంది అన్నారు.

Printed, Published and Owned by **Adula Thirupathi**, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**